www.vaarthavedhikasurya.com

RNI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య


తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

యాదాద్రి భువనగిరి | శుక్రవారం 19, డిసెంబర్ 2025 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 208 | పేజీలు: 08 | వెల: 5/

## నేడు నగరానికి కేంద్ర ఎన్నికల కమిషనర్ రాక

హైదరాబాద్,డిసెంబర్18(వార్త వేదిక సూర్య): భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో హైదరాబాద్ విమానాశ్రయానికి వస్తారు. ఆ తర్వాత.. సాయంత్రం ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రమైన శ్రీశైలానికి బయలుదేరి వెళతారు. శనివారం ఉదయం శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో మహా హారతి కార్యక్రమంలో పాల్గొని, స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ సందర్శనలో హైదరాబాద్‌లోని చారిత్రక ప్రదేశాలైన గోల్కొండ కోట, చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం వంటి వాటినీ సందర్శించే అవకాశం ఉంది. అనంతరం.. డిసెంబర్ 21న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో తెలంగాణకు చెందిన బూత్ లెవల్ ఆఫీసర్ల తో జ్ఞానేష్ కుమార్ సమావేశమై.. ఎన్నికల ప్రక్రియపై




మిగతా 2లో..

# 2029లో కూడా ఇవే ఫలితాలు

- 12702 గ్రామ పంచాయతీలలో 7527 కాంగ్రెస్, 808 మంది కాంగ్రెస్ రెబల్స్ నెగ్గారు
- 8335 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్, కాంగ్రెస్ రెబల్స్ గెలుచుకున్నారు
- కేసీఆర్.. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధం
- గోదావరి, కృష్ణా జలాలపై ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం
- ఎప్పుడంటే అప్పుడు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తాం
- కేసీఆర్‌కు రేవంత్ సవాల్
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్,(వార్త వేదిక సూర్య):

ఎలాంటి లోటు పాట్లు లేకుండా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసిన అధికారులకు అభినందనలు. కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించిన తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల తరువాత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో మాకు సంపూర్ణ మద్దతుగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలు.

12702 గ్రామ పంచాయతీలలో 7527 కాంగ్రెస్, 808 మంది కాంగ్రెస్ రెబల్స్ నెగ్గారు. 8335 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్, కాంగ్రెస్ రెబల్స్ గెలుచుకున్నారు. అంటే 66 శాతం కాంగ్రెస్ గెలుచుకుంది. బీఆరెస్, బీజేపీ కూటమిగా 33 శాతం, కమ్యూనిస్టులు 1 శాతం ఫలితాలు సాధించాయి. ఇవి రెండేళ్ల

మిగతా 2లో..

## సీఎం రేవంత్ రెడ్డితో ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా భేటీ

జూబ్లీహిల్స్,(వార్త వేదిక సూర్య): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా గురువారం మర్యాదపూర్వక భేటీ అయ్యారు. ఆర్‌బీఐ బోర్డ్ మీటింగ్ కు హాజరయ్యేందుకు హైదరాబాద్ వచ్చిన నేపథ్యంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను సంజయ్ మల్హోత్రా ప్రశంసించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలను ఆర్‌బీఐ గవర్నర్ కు సీఎం వివరించారు.

విద్యుత్ రంగంలో సంస్కరణలు, మూడో డిస్కం ఏర్పాటుపై ఆర్‌బీఐ గవర్నర్ కు తెలిపారు. అలాగే, సోలార్ విద్యుత్ వినియోగం పెంచే దిశగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. బీయుడీఎస్ యాక్ట్ ను నోటిఫై చేయాలని ముఖ్యమంత్రిని ఆర్‌బీఐ గవర్నర్ కోరారు. మరిన్ని సంస్కరణలు, ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్ ఫేజ్ (యుఎల్ఐ) విషయం ఆర్‌బీఐ తీసుకుంటున్న చొరవను సిఎం కు వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు డిపాజిట్స్ క్లెయిమ్ క్యాంపెయినింగ్ పై సిఎం కు ఆర్‌బీఐ గవర్నర్ వివరించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్‌బీఐ హైదరాబాద్ రీజనల్ డైరెక్టర్ చిన్మోయ్ కుమార్, జనరల్ మేనేజర్స్ మేజర్ యశ్పాల్ చరణ్, ఎస్.పాణిగ్రాహి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై

# త్వరలో నిర్ణయం

- అందరితో చర్చించి ఓ నిర్ణయానికి వస్తాం
- ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు కృతజ్ఞతలు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ వెల్లడి



హైదరాబాద్,డిసెంబర్18(వార్త వేదిక సూర్య): రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో, ప్రజాస్వామిక బద్ధంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించినందుకు ఎన్నికల యంత్రాంగానికి, అధికారులకు ప్రభుత్వం

మిగతా 2లో..

## గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం..

- ఎన్నికల్లోని విజేతలకు శుభాకాంక్షలు
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య): నూతనంగా గెలిచిన సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులకు నా పక్షాన, ముఖ్యమంత్రి పక్షాన, పీసీసీ పక్షాన అభినందనలు శుభాకాంక్షలు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొత్తం 173 సర్పంచ్‌లు ఉంటే.. సైదాపూర్ మండలంలో 2 గ్రామాలకు ఎన్నికలు కాలేవు.. మొత్తం 171 గ్రామ పంచాయతీ లకు ఎన్నికలు జరిగాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఆయన హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. 171 సర్పంచ్‌లకు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ సొంతగా 108



మిగతా 2లో..



## చంద్రబాబుకు మరో అరుదైన గౌరవం

- బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు
- పురస్కారాన్ని ప్రకటించిన ఎకనమిక్ టైమ్స్
- అభినందించిన డిప్యూటీ సిఎం పవన్ తదితరులు

అమరావతి,(వార్త వేదిక సూర్య): ఏపీ సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభించింది. ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ 'ఎకనమిక్ టైమ్స్' ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్'లో వెల్లడించారు. 'చంద్రబాబుకు ఈ అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణం. రాష్ట్రంతో పాటు మా కుటుంబానికి ఇది ఎంతో ప్రతిష్ఠాత్మకం. సంస్కరణలను చంద్రబాబు ధైర్యంగా ముందుకు తీసుకెళ్లారని జ్యూరీ ప్రశంసించింది. పాలనలో సంస్కరణలు, వేగం, విశ్వాసంపై చూపిన నిబద్ధతకి ఈ అవార్డు నిదర్శనం. రాష్ట్రాభివృద్ధికి చంద్ర బాబు నాయకత్వం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోంది.

మిగతా 2లో..




## తెలంగాణ గ్రూప్-3 ఫలితాలు విడుదల


హైదరాబాద్,డిసెంబర్18 (వార్త వేదిక సూర్య): తెలంగాణ గ్రూప్-3 అభ్యర్థుల ఫలితాలు గురువారం విడుదల య్యాయి. సెలక్షన్ లిస్ట్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. గ్రూప్-3కి 1,370 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో జరిగిన గ్రూప్-3 పరీక్ష జరిగిన విషయం తెలిసిందే. జూనియర్ అసిస్టెంట్, ఎల్‌డి స్టెనో, టైపిస్ట్, జూనియర్ స్టెనోగ్రాఫర్ తదితర

మిగతా 2లో..

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో

# వీబీ జీ రామ్ జీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- లోక్‌సభలో ప్రతులు చించి నిరసన తెలిపిన విపక్షం
- వెల్‌లోకి దూసుకెళ్లి పప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన
- మహాత్ముడి పేరు మార్పు దుర్మార్గమని విమర్శలు
- గాంధీ ఆశయాలను ముందుకు తీసుకు వెళుతున్నమన్న శివరాజ్‌సింగ్



న్యూఢిల్లీ,డిసెంబర్18(వార్త వేదిక సూర్య): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. విపక్ష సభ్యుల నిరసనలపై స్పందించిన స్పీకర్.. ఓం బిర్లా బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని చెప్పారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' ఎంజీనరేగాను రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్' (వీబీ జీ రామ్ జీ) బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందోళన నడుమ స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లు కు ఆమోదం లభించింది. ఈ సమయంలో విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'వీబీ జీ రామ్ జీ' బిల్లు ప్రతులను చించి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది.అంతకుముందు బిల్లు తీరుపట్ల మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించి పడేశారు.

మిగతా 2లో..

## ప్రధాని మోడీకి మరో గౌరవం ఆర్డర్ ఆఫ్ ఒమన్ పురస్కారం ప్రదానం

న్యూఢిల్లీ,డిసెంబర్18(వార్త వేదిక సూర్య):

భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బుధవారం ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ప్రధాని మోదీ.. మరుసటి రోజే మరో అరుదైన ఘనతను దక్కించుకున్నారు. ఒమన్ దేశం కూడా తన అత్యున్నత పౌర పురస్కారంతో ప్రధాని మోదీని గౌరవించడం విశేషం. ప్రధాని మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరిగా ఒమన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. భారత్, ఒమన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్.. మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' అనేది ఒమన్, విదేశీయులకు ఇచ్చే అత్యంత విశిష్టమైన పౌర పురస్కారం.భారత్ - ఒమన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ఒమన్‌లో పర్యటిస్తున్నారు. కాగా, ప్రధాని మోదీ ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి 29 అత్యున్నత పౌర పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల కువైట్ ప్రభుత్వం కూడా 'ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్-కబీర్'తో ఆయనను గౌరవించింది.



## ఉపాధి హామీ నుంచి గాంధీ పేరు

# తొలగించడం క్షమించరాని నేరం

- పథకాల పేర్లు మార్చి నిర్వీర్యం చేయడంలో కాంగ్రెస్ - బీజేపీ దొందూ దొందే
- బీజేపీకి జాతీయ పార్టీ అనే నైతిక హక్కే లేదు: కేటీఆర్.
- ప్రజా క్షేమం కన్నా పేర్ల మార్పుపైనే చిల్లర రాజకీయం
- కేసీఆర్ హుందాతనాన్ని చూసి నేర్చుకోండి
- కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ హితవు

హైదరాబాద్,(వార్త వేదిక సూర్య): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పథకాల పేర్లు మార్చడంలోనూ, వాటిని నిర్వీర్యం చేయడంలోనూ ఈ రెండు పార్టీలు "దొందూ దొందే" అని ఆయన విమర్శించారు. ముఖ్యంగా జాతీయ ఉపాధి

మిగతా 2లో..



## ఫర్ ఫెక్షనే కాదు.. సిన్సియారిటీ కూడా అవసరం

- పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే 'గుడ్ గవర్నెన్స్'
- ప్రజాసేవలో బాహ్య ఒత్తిళ్ల కంటే అంతర్గత బలహీనతలే ప్రమాదకరం
- యువ సివిల్ సర్వెంట్లకు మంత్రి శ్రీధర్ బాబు దిశానిర్దేశం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

'ఈ దేశం మీ నుంచి కేవలం ఫర్ ఫెక్షనే మాత్రమే ఆశించడం లేదు... అంతకంటే ఎక్కువగా మీరు చేసే పనిలో సిన్సియారిటీని కూడా కోరుకుంటోంది' అని యువ సివిల్ సర్వెంట్లకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దిశా నిర్దేశం చేశారు. జూబ్లీహిల్స్ లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్సిట్యూట్ ఆఫ్ తెలంగాణలో గురువారం నిర్వహించిన 'స్పెషల్ ఫౌండేషన్ కోర్స్ ఫర్ ఏఐఎస్ అండ్ సీసీఎస్ ఆఫీసర్స్ - 2025' ముగింపు వేడుకలకు ఆయన విశిష్ట అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గవర్నెన్స్ అంటే కేవలం ఫైళ్లు, నిబంధనలు కాదని, అది ప్రజలతో మమేకమయ్యే



ఒక హ్యూమన్ రిలేషన్ అని అన్నారు. అధికారం, హోదా, ప్రోటోకాల్స్ అన్నీ తాత్కాలికమని.. ప్రజల జీవితాల్లో మీరు తీసుకొచ్చే సానుకూల మార్పు మాత్రమే శాశ్వతమన్నారు. నిర్ణయాలు తీసుకునే సమయంలో సమాజంలోని చిట్టచివరి

మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# 2029లో కూడా ఇవే ఫలితాలు

మొదటి పేజీ తరువాయి..

ప్రజా పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ కు పట్టం కట్టారు. 94 శాసనసభ నియోజవర్గాల్లో స్థానిక సంస్థల ఎన్నికల జరిగితే 87 శాసనసభ స్థానాల్లో కాంగ్రెస్ అత్యధిక ఫలితాలు సాధించింది. బీఆరెస్ 6 నియోజవర్గాల్లో , బీజేపీ 1 నియోజకవర్గంలో అత్యధిక ఫలితాలు సాధించాయి.

పేదలకు మేం అందించిన సన్నబియ్యం, ఉచిత కరెంటు, సజ్జ వడ్లకు బోనస్, 500 కే సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు, ఎస్సీ వర్గీకరణ అమలు, కులగణన ఇతర పథకాలతో ప్రజలు మమ్మల్ని ఆదరించారు. ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారెంటీగా ప్రజలకు స్వేచ్ఛను అందించాం. స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో ఎన్నికలు జరిపించాం.

హోదాలను అడ్డుపెట్టుకుని ఎన్నికలను ప్రభావితం చేసేలా మేం నిర్ణయం తీసుకోలేదు. గెలిస్తే కళ్లు నెత్తికెక్కినట్లుగా మేం ఏనాడు వ్యవహరించలేదు. ఈ ఫలితాలు మాపై మరింత బాధ్యతను పెంచాయి. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చి పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర బీజేపీ చేస్తోంది. ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్ తోనే సాధ్యం.

ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా కొందరికి ఇంకా అహంకారం తగ్గలేదు. ఒకాయన కడుపులో మూసీలో కాలుష్యం కంటే ఎక్కువ విషం కనిపిస్తోంది. ఈ ఫలితాలుచూసే అద్భుతం అని కొందరు జబ్బలు చరుచుకుంటున్నారు. 2029 లో కూడా ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయి. 2/3 మెజారిటీతో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది.

కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ బీఆరెస్ గెలవలేదు. కేటీఆర్ ను తప్పించాలని హరీష్ వర్గం సోషల్ మీడియాలో ప్రచారం మొదలు పెట్టింది. అందుకే ఆ విషయం చర్చకు రాకుండా కేటీఆర్ జిల్లాల పర్యటనలు మొదలు పెట్టారు. మీ కోపంతో అసూయతో ప్రజలకు మంచి జరగకుండా అడ్డుకోవద్దు. దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతాం. కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో ఉండగానే ఆయన్ను ఓడించి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొచ్చాం. ఇప్పుడు ఆయన క్రియాశీల రాజకీయాల్లో లేరు. కెసీఆర్ కు సూటిగా సవాల్ విసురుతున్నా.

ప్రతిపక్ష నాయకుడిగా లేఖ రాయమనండి. కృష్ణా జలాలపై ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం. ఎప్పుడంటే అప్పుడు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తాం. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం. ఉమ్మడి రాష్ట్రంలో కంటే పదేళ్లలో తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేసింది బీఆరెస్, కేసీఆర్. గోదావరి, కృష్ణా జలాలపై వారు చేసిన ద్రోహం ఆధారాలతో సహా నిరూపిస్తాం. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ప్రజాస్వామ్య బద్ధంగా అసెంబ్లీలో చర్చ చేసి ముందుకు వెళతాం.

## ఫర్ఫెక్షనే కాదు.. సిన్సియారిటీ కూడా అవసరం

మొదటి పేజీ తరువాయి..

వ్యక్తిని, నిరుపేదల ప్రయోజనాలనూ పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. అప్పుడే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయన్నారు. కార్యాలయాలకు మాత్రమే పరిమితం కాకుండా నిత్యం ప్రజలతో మమేకం కావాలని ఉద్బోధించారు.

ప్రజా సేవలో బాహ్య ఒత్తిళ్ల కంటే అహంకారం, ఉదాసీనత, అవినీతిలాంటి అంతర్గత




బలహీనతలే ప్రమాదకరమని హెచ్చరించారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ స్వీయ నియంత్రణ పాటిస్తూనే... నిజాయితీ, వినమ్రత, ధైర్యం కోల్పోవద్దని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పౌర సేవలు ప్రజల ముంగిటకు చేరాలంటే టెక్నాలజీ వినియోగం అత్యవ సరమన్నారు. అయితే... ఆ సాంకేతికత ప్రజలకు చేరువగా ఉండాలి కానీ, వారిని భయపెట్టేలా ఉండొద్దన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే 'గుడ్ గవర్నెన్స్' సాధ్యమవుతుందని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేయాలని యువ అధికారులకు సూచించారు.

## చంద్రబాబుకు మరో అరుదైన గౌరవం

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడుల ఆకర్షణ, సంస్కరణాత్మక పాలనకు సీఎం స్ఫూర్తిగా నిలుస్తున్నదని లోకేశ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే సీఎం చంద్రబాబుకి ఎకనమిక్ టైమ్స్ సంస్థ 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారాన్ని ప్రకటించడం సంతోషదాయకమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు నాయకత్వ శైలి ఎంతో స్ఫూర్తినిస్తుంది. రాష్ట్రాభివృద్ధి కోసం, నవతరం భవిష్యత్తు కోసం ఆయన అమలు చేస్తున్న పాలనా విధానాలు, పారిశ్రామికవృద్ధికి చేపడుతున్న సంస్కరణలు కచ్చితంగా సత్ఫలితాలనిస్తాయి. ఆయనకు దక్కిన ఈ అవార్డు రాష్ట్రమంతటికీ గర్వ కారణంగా భావిస్తున్నాను. ఈ పురస్కారం ద్వారా రాష్ట్రానికి ఒక బ్రాండ్ ఇమేజ్ వస్తుందని పవన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అనుకూల విధానాల అమలు, పారిశ్రామిక సంస్కరణలు, రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నందుకు గానూ.. 'బిజినెస్ రీ ఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ముఖ్యమంత్రి చంద్రబాబును వరించింది. మార్చిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఈ అవార్డును చంద్రబాబుకు ప్రదానం చేయనున్నారు. ముఖ్యమంత్రికి అవార్డు రావడం పట్ల మంత్రులు, అధికారుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ అవార్డు తనకు లభించడంపట్ల సహచర మంత్రులు, అధికారులు, కలెక్టర్ల సమష్టి కృషి అని సీఎం చంద్రబాబు అన్నారు.

## తెలంగాణ గ్రూప్-3 ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

పోస్టులను భర్తీ చేసేందుకు నిర్వహించిన పరీక్షకు సుమారు 2.5 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు.గ్రూప్ 3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్లు అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచింది. కోర్టులో ఉన్న పెండింగ్ కేసుల తుది తీర్పుకు లోబడి ఈ ఫలితాల ఎంపిక ఉంటుందని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. ఒక్క ఖాళీని ప్రస్తుతం విత్‌హెల్డ్ లో ఉంచింది కమిషన్. తప్పుడు వివరాలు సమర్పించినట్లు తేలితే ఎంపికను రద్దు చేస్తామని కమిషన్ హెచ్చరించింది. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే.

## నేడు నగరానికి కేంద్ర ఎన్నికల కమిషనర్ రాక


(మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శకాలు, దిశానిర్దేశం చేయనున్నారు.
ఈ సమావేశం ఎన్నికల విధానాలను మరింత బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించే అవకాశముందని తెలుస్తోంది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ సందర్శన రాష్ట్ర ఎన్నికల యంత్రాంగానికి మరింత ఊతమివ్వనుందని అధికారులు భావిస్తున్నారు. అదేరోజు రాత్రి తిరిగి ఢిల్లీ వెళతారు.

## ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తునకు మరో సిట్

**నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ నాయకత్వం**

హైదరాబాద్,డిసెంబర్18(వార్త వేదిక సూర్య): ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటికే ఈ కేసులో సిట్ విచారణ చేస్తుండగా, హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో సీనియర్ ఐపీఎస్ అధికారులతో మరో సిట్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సిట్‌లో రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ, సిద్దిపేట కమిషనర్ ఎస్.ఎం.విజయ్ కుమార్, మాదాపూర్ డీసీపీ రితురాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ్‌రెడ్డి, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ రవీందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ అదనపు డీసీపీ కేఎస్ రావు, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, టీజీ న్యాబ్ డీఎస్పీ శ్రీధర్, హైదరాబాద్ మెట్రోలో పనిచేస్తున్న నాగేందర్ సభ్యులుగా ఉన్నారు. వీరు ఏంచేస్తారన్నది విధి విధానాలు రాలవాల్సి ఉంది.



# గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

మంది గెలిచారు..11 మంది ఇండిపెండెంట్ లు కాంగ్రెస్ లోకి వస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 171 గ్రామ పంచాయతీ లకు 119 మంది కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు అవుతున్నారు.బీఆర్ఎస్ 40, బీజేపీ 10 , సీపీఐ 2 గ్రామ పంచాయతీ లు గెలిచాయి. సర్పంచ్ లుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కృషి తో విజయం సాధించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆశీర్వదించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్, రైతు భరోసా,రైతు రుణమాఫీ,మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఉద్యోగాల భర్తీ ఇలా ఎన్నో పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసింది. హుస్నాబాద్ నియోజకవర్గంలో 80 శాతంకి పైగాపోలింగ్ జరిగిన గ్రామాలకు అభినందనలు. ఈ మధ్య జూబ్లీహిల్స్ లో జరిగిన ఎన్నికల్లో సినీ యాక్టర్లు ,మొత్తం అధికార యంత్రంగా కదిలిన అక్కడ ఇంత పోలింగ్ కాలేకపోయింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రజాస్వామ్యం మీద విశ్వాసం తో ఓటింగ్ పెద్ద ఎత్తున తరలించారు. గ్రామాల్లో వృద్ధులు ఓటు వేస్తేనే ఉన్నట్టు లేకపోతే లేనట్టు అనే విధంగా వ్యవహరించారు.. అందుకే పెద్ద ఎత్తున ఓటింగ్ జరిగింది. హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్య,వైద్యం,ఉపాధి కల్పన , వ్యవసాయం , టూరిజం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం. ప్రజలు ప్రజా సమస్యల పై వచ్చిన స్థానిక సర్పంచ్ లు మీ స్థాయిలో పరిష్కారం చేసే విధంగా ఉండాలి. హుస్నాబాద్ మండలంలో 17 గ్రామ పంచాయతీ లు ఉంటే 13 కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ,ఇద్దరు ఇండిపెండెంట్ లు గెలిచారు.. వారు కాంగ్రెస్ లోనే ఉన్నారు ఇక్కడ కాంగ్రెస్ పార్టీ 15 స్థానాలు గెలిచింది.. బీఆర్ఎస్ రెండు స్థానాలు గెలిచింది.అక్కన్న పేట మండలంలో 38 గ్రామ పంచాయతీ లకు 27 కాంగ్రెస్ పార్టీ గెలిచింది.. ఇద్దరు ఇండిపెండెంట్ లు మొత్తం కాంగ్రెస్ 29, , బీఆర్ఎస్ 7, బీజేపీ 1 గెలిచింది. కోహెడ లో 27 గ్రామ పంచాయతీ లకు లో 17 కాంగ్రెస్ పార్టీ గెలిచింది ఒకరు ఇండిపెండెంట్ కలుపుకొని కాంగ్రెస్ 18 గెలిచింది బీఆర్ఎస్ 5, బీజేపీ 4 గెలిచింది. చిగురు మామిడి లో 17 గ్రామ పంచాయతీ లకు 7 కాంగ్రెస్ పార్టీ ఒకటి ఇండిపెండెంట్ గెలిచింది.. 8 బీఆర్ఎస్, ఒకటి బీజేపీ గెలిచింది. సైదాపూర్ మండలంలో 27 గ్రామ పంచాయతీ లకు లో 19 కాంగ్రెస్ పార్టీ గెలిచింది.. 7 బీఆర్ఎస్, ఒకటి బీజేపీ గెలిచింది. భీమదేవరపల్లి లో 25 సర్పంచ్ లకు 15 కాంగ్రెస్ పార్టీ ముగ్గురు ఇండిపెండెంట్ గెలిచారు.. మొత్తం 18 కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కాగా 4 బీఆర్ఎస్, 3 బీజేపీ గెలిచింది. ఎలుకతుర్తి లో 20 గ్రామ పంచాయతీ లు ఉంటే 10 కాంగ్రెస్ ఇద్దరు ఇండిపెండెంట్ లు గెలవగా కాంగ్రెస్ 12 కాగా.. 7 బీఆర్ఎస్, ఒకటి సీపీఐ గెలిచింది. గెలిచిన సర్పంచ్ లకు, ఉప సర్పంచ్ లకు ,వార్డు సభ్యులకు శుభాకాంక్షలు. నియోజకవర్గంను అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తాం. అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని మంత్రి అన్నారు.

## ఉపాధి హామీ నుంచి గాంధీ పేరు తొలగించడం క్షమించరాని నేరం

(మొదటి పేజీ తరువాయి)

హామీ పథకం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా బీజేపీ తన సంకుచితత్వాన్ని చాటుకుందని, పల్లె ప్రజల ఉపాధిని దెబ్బతీసేలా కేంద్రం వ్యవహరిస్తోందని మండి పడ్డారు. జాతిపిత పేరును తొలగించిన బీజేపీకి జాతీయ పార్టీ అని చెప్పుకునే నైతిక హక్కు లేదని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కేటీఆర్ నిప్పులు చెరిగారు. పేదలకు రూ. 5లకే భోజనం అందించే "అన్నపూర్ణ క్యాంటీన్ల" పేరును "ఇందిరమ్మ క్యాంటీన్లు"గా మార్చడం చిల్లర రాజకీయమని కొట్టిపారేశారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకలైన బతుకమ్మ చీరలను నిలిపివేసి, నేతన్నల పొట్టకొట్టి, ఇప్పుడు వాటికి రాజకీయ రంగు పులుముతూ "ఇందిరమ్మ చీరలు"గా మార్చడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అలాగే తెలంగాణ ఆత్మగౌరవ చిహ్నమైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి, "కాంగ్రెస్ తల్లి"ని ప్రజలపై రుద్దడం అమానుషమని ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన విప్లవాత్మక పథకాలైన రైతుబంధును రైతుభరోసాగా మార్చి రైతులకు అందకుండా చేస్తున్నారని, కేసీఆర్ కిట్లు మరియు న్యూట్రీషన్ కిట్లను నిలిపివేసి తల్లీబిడ్డల ఆరోగ్యంతో కాంగ్రెస్ ఆటలాడుతోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అవార్డులు తెచ్చిపెట్టిన పల్లె ప్రగతి, హరితహారం వంటి పథకాల పేర్లు మార్చి వాటికి నిధులు ఇవ్వకుండా ఎండబెడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ గారు గతంలో వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను అదే పేర్లతో కొనసాగించి తన విశాల దృక్పథాన్ని చాటుకున్నారని గుర్తు చేశారు.

చివరగా, ప్రజలకు మేలు చేయడం కంటే కేవలం పేర్లు మార్చి ప్రజలను ఏమార్చడమే లక్ష్యంగా ఈ ఢిల్లీ పార్టీలు పనిచేస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. దేశ ముఖచిత్రాన్ని మార్చే ఆలోచన ఈ పార్టీలకు లేదని, 150 కోట్ల భారతీయులు ఈ రాజకీయాల వల్ల నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు త్వరలోనే ఈ రెండు పార్టీల భరతం పడతారని కేటీఆర్ హెచ్చరించారు.

### జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో

# వీబీ జీ రామ్ జీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

వీరి ఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నాయకులు టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు.. జీ రామ్‌జీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం అంటే జాతిపితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు. మరోవైపు జీ రామ్‌జీ బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి పేర్లు మార్చాలనే దురుద్దేశం ఉందంటూ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను సైతం ఆయన ఖండించారు. పేర్లు మార్చాలనే ఉద్దేశం కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం కేవలం పనిపై మాత్రమే దృష్టి పెడుతోందని చెప్పుకొచ్చారు. అందరితో చర్చించిన తర్వాతే కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కామెంట్స్‌పై ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీలు సభ వెల్‌లోకి ప్రవేశించి.. బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా మాట్లాడుతూ.. 'కాగితాలను చించివేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపలేదు. దేశం మిమ్మల్ని చూస్తోంది.' అని విపక్ష సభ్యులను హెచ్చరించారు. అంతకుముందు బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాల ఆరోపణలకు కేంద్ర మంత్రి






శివరాజ్ సింగ్ చౌహన్ బదులిచ్చారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు అనుగుణంగానే మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. బాపూ సిద్ధాంతాలను కాంగ్రెస్ సర్కారు చంపేసింది. కానీ, ఎన్డీయే ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోంది. పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, స్వచ్ఛభారత్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో గాంధీజీ కలలను మేం సాకారం చేస్తున్నాం అని తెలిపారు. ఈ సందర్భంగా గత కాంగ్రెస్ పాలనపై ఆయన విరుచుకుపడ్డారు. తొలుత ఉపాధి హామీ పథకానికి ఎన్ఆర్‌జిఎ అనే పేరు ఉండేది. ఆ తర్వాత 2009లో లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరు చేర్చింది. అంతేకాదు.. వారి హయాంలో ఈ పథకం అమలులో అనేక లోటుపాట్లు చోటుచేసుకున్నాయి. కూలీలపై ఎక్కువ ఖర్చు చేసి.. మెటీరియల్ కొనుగోలుకు తక్కువ వెచ్చించారని చౌహాన్ మండిపడ్డారు. పేరు మార్పుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శలను ప్రస్తావిస్తూ.. గతంలోనే అనేక పథకాలకు కాంగ్రెస్ గాంధీ-నెహ్రూ పేర్లు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. పల్లె ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా దాదాపు రెండు దశాబ్దాల కిందట 'ఎన్ఆర్ఈజీఏ' చట్టాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది. తర్వాత 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు. అనంతరం సభను వాయిదా వేశారు.

## ఎంపీటీసీ, జేడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై త్వరలో నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను సాధించడంపై శాసనసభ సమావేశాల్లో చర్చించి అన్ని పార్టీల అభిప్రాయం మేరకు ఎంపీటీసీ, జేడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయానికి వస్తామని చెప్పారు. రాష్ట్రంలో 12,728 పంచాయతీలకు గాను 12,702 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగ్గా, ప్రజాస్వామిక బద్ధంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం, ప్రజలు స్వేచ్ఛగా తీర్పును ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ ఎన్నికల నిర్వహణలో అధికారులు స్వేచ్ఛగా పనిచేశారని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించినందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దామోదర రాజనర్సింహరు, ధనసరి అనసూయ సీతక్కలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు.

ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రజల ముందుకు వెళ్లగా, తమకు 7,527 గ్రామ పంచాయతీల్లో (66 శాతం) ప్రజలు అందించిన ఆశీర్వాదం.. ప్రభుత్వంపై మరింత బాధ్యత పెంచిందని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండిండినీ సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నామని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, 27 వేల కోట్ల రూపాయల మేరకు సున్నా వడ్డీకే మహిళా సమాఖ్యలకు రుణాలు, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 61 వేల ఉద్యోగాల భర్తీ, సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం, వందేళ్లుగా జరగని బీసీ కులగణన చేపట్టడం, పేదలకు మంచి విద్యను అందించాలన్న ప్రయత్నాలు... ఇలా అనేక అంశాల్లో ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతోందని ముఖ్యమంత్రి వివరించారు. ఒకవైపు ఆదాయాన్ని పెంచుకుంటూ దుబారాను తగ్గిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరక్కుండా ప్రజలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ తాపత్రయమని ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి గారు చెప్పారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులకు సంబంధించి పూర్తి వివరాలతో శాసనసభలో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

## హీరా గ్రూప్‌నకు 5కోట్ల జరిమానా విధించిన హైకోర్టు

హైదరాబాద్,డిసెంబర్18(వార్త వేదిక సూర్య): నౌహీరా షేక్‌కు చెందిన హీరా గ్రూప్‌నకు హైకోర్టు భారీ జరిమానా విధించింది. రూ.5 కోట్ల జరిమానా విధించిన న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక... ఆ మొత్తాన్ని 8 వారాల్లో పీఎం సహాయ నిధికి జమ చేయాలని హీరా గ్రూప్‌ను ఆదేశించారు. కోర్టును తప్పుదోవ పట్టించేలా పిటిషన్ దాఖలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి.. భారీ జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.




పేదల నుంచి పెట్టుబడి పేరుతో డబ్బులు వసూలు చేసి తిరిగి చెల్లించలేదని హీరా గ్రూప్‌తో పాటు.. నౌహీరా షేక్ పైనా ఈడీ అధికారులు పీఎంఎల్ఏ కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు హీరా గ్రూప్‌నకు చెందిన 59 ఆస్తులను అటాచ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ఆస్తులను వేలం వేసేందుకు ఈడీ అధికారులు వెబ్ సైట్‌లో వివరాలు ఉంచారు. ఈనెల 26న వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

ఈడీ అధికారులు సరిగా వేలం నిర్వహించడం లేదని, ఆస్తుల విలువ తక్కువగా చూపించారని నౌహీరా షేక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వేలాన్ని రద్దు చేయాలని కోరారు. అప్పటి వరకు వేలం వేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇరువైపులా వాదనలు విన్న జస్టిస్ నగేశ్ భీమపాక.. పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తప్పుడు పిటిషన్లు వేసి కోర్టు సమయ వృథా చేస్తున్నారన్న న్యాయమూర్తి.. ఈ మేరకు హీరాగ్రూప్‌నకు రూ.5కోట్ల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY









## బాబుల్ రెడ్డి నగర్ సమాఖ్య-2 సమావేశం

### - మహిళలకు ఆర్థిక సాధికారత, ఆరోగ్య అవగాహన

**మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):** బాబుల్ రెడ్డి నగర్ సమాఖ్య-2 అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి సాయంత్రం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రూపు సభ్యులతో పొదుపు, వడ్డీలు, ఇన్సూరెన్స్ సంబంధిత సమస్యలపై వివరంగా చర్చించారు. చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలకు రూ.10,000-రూ.20,000 వరకు సబ్సిడీ సానిధి రుణాలు పొందే అవకాశాలపై అవగాహన కల్పించారు. మహిళల ఆర్థిక సాధికారత, ఉపాధి అవకాశాల పెంపుపై సూచనలు అందించారు. సమావేశంలో




ఆశా వర్కర్లు లక్ష్మీ, రేణుకలు కూడా పాల్గొని జాతీయ కుష్టి నిర్మూలన కార్యక్రమంపై వివరించారు. కుష్టి వ్యాధి లక్షణాలైన చర్మరంగు మార్పులు (గోధుమ లేదా ఎర్రటి మచ్చలు), చర్మం మాయడం/మెరుస్తూ లేదా జిడ్డుగా ఉండటం, ముఖంపై నూడిల్ కురుపులు, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, ముక్కు లోపలికి పోవడం, అరచేతుల్లో స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలను గుర్తించి వెంటనే వైద్య సహాయం తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ వ్యాధి మైక్రోబ్యాక్టీరియా వల్ల కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి సమావేశంలో ప్రస్తావించిన అంశాలను సభ్యులకు స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీ హేమలత, సమాఖ్య ప్రతినిధులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ ఏ పార్టీలో ఉన్నారో స్పష్టం చేయాలి: సూరెడ్డి వినయ్ రెడ్డి

**మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):** నిన్న తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో ఉన్నామని చెప్పుకుంటున్న ఐదుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి ఎలాంటి స్పష్టమైన ఆధారాలు లేవని తేల్చి చెప్పారు.




ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్‌పై తీవ్ర విమర్శలు చేస్తూ సూరెడ్డి వినయ్ రెడ్డి ప్రశ్నించారు. "ప్రకాశ్ గౌడ్ , మీరు అసలు ఏ పార్టీకి చెందినవారు? రాజేంద్రనగర్ ప్రజలతో రాజకీయ నాటకం ఆడటం మానేసి, మీరు ఏ పార్టీలో ఉన్నారో స్పష్టంగా చెప్పాల్సిన బాధ్యత మీపై ఉంది" అని అన్నారు. ఏళ్ల తరబడి రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి అనే మాటే కనిపించడం లేదని, రోడ్లు, డ్రైనేజ్, మౌలిక సదుపాయాలపై పూర్తిగా నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు. షాప్ ఓపెనింగ్స్, పెళ్లిళ్లు, ఫంక్షన్లకు హాజరవడం తప్ప ప్రజా సమస్యలపై మీకు ఎలాంటి ఆసక్తి లేదని.మండి పడ్డారు. రాజేంద్రనగర్ ప్రజలకు కావాల్సింది నిజాయితీ, బాధ్యతాయుత పాలన మరియు అభివృద్ధి అని, మోసం కాదని స్పష్టం చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే గా టి. ప్రకాశ్ గౌడ్ పూర్తిగా విఫలమయ్యారని సూరెడ్డి వినయ్ రెడ్డి విమర్శించారు.

## లక్ష్మీగూడా రాజీవ్ గృహకల్ప వద్ద కళ్లెం లక్ష్మారెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి ప్రత్యేక పూజలు

**మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడా రాజీవ్ గృహకల్ప వద్ద కళ్లెం లక్ష్మారెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమం




శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. ఈ కార్యక్రమంలో చందు స్వామి, ప్రదీప్ స్వామి సహా పలువురు అయ్యప్ప స్వాములు పాల్గొనగా, స్థానిక భక్తులు, మహిళామణులు కూడా విశేషంగా హాజరై స్వామిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. పూజా కార్యక్రమం సందర్భంగా అయ్యప్ప స్వామి భజనలు, నామస్మరణలతో పరిసర ప్రాంతమంతా భక్తి భావంతో మార్మోగింది.పూజ అనంతరం అయ్యప్ప స్వాములకు సంప్రదాయబద్ధంగా బిక్ష నిర్వహించగా, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమం భక్తుల సమిష్టి సహకారంతో శాంతియుతంగా, ఆధ్యాత్మిక పరిమళంతో విజయవంతంగా ముగిసింది.

# గండిపేట జలాశయంపై అసాంఘిక చర్యలు

### - బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్

**మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):** గండిపేట నుంచి క్యాండ్యూట్ కాలువ ద్వారా హైదరాబాద్ ప్రజలకు మంచినీటి సరఫరా జరుగుతున్న విషయం జగమెరిగిన సత్యం. రాబోయే కాలంలో సింగూర్ ప్రాజెక్టుకు మరమ్మత్తులు చేపడతామని ప్రభుత్వం హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో, పరిస్థితులు అనుకూలించక అక్కడి నుంచి నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అటువంటి పరిస్థితుల్లో నీటి ఎద్దడిని తట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చే ప్రధాన ఆధారంగా గండిపేట నీరే ప్రజలకు శరణ్యంగా మారనుంది. ఇలాంటి కీలక సమయంలో, త్రాగునీటి జలాశయమైన గండిపేటలో కొందరు అసాంఘిక శక్తులు సెప్టిక్ ట్యాంకుల ద్వారా వ్యర్థాలను తెచ్చి వేయడం అత్యంత ఆందోళనకరమని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ మణికొండ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అక్రమ చర్యలకు పాల్పడిన వారిపై కఠినాతి కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత గండిపేట జలాశయ సంరక్షణ అధికారులదేనని వారు స్పష్టం చేశారు. అయితే, ఈ విషయంలో సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు మౌనం పాటించడం విచిత్రమని విమర్శించారు. అక్రమ వ్యర్థాల వేయడాన్ని చూస్తూ కూడా ఉదాసీనత ప్రదర్శిస్తున్న అధికారులపై సైతం కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మణికొండ నాయకులు డిమాండ్ చేశారు.



# చలిలో నిరాశ్రయ మానసిక వికలాంగ వృద్ధుడికి పునర్జన్మ ఇచ్చిన మానవత్వం

### రాజేంద్రనగర్ సర్కిల్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి సేవా దృక్పథానికి ప్రశంసలు

**మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మెహిదీపట్నం వెళ్లే ప్రధాన రహదారిపై హృదయాన్ని కదిలించే ఘటన చోటుచేసుకుంది. చలిలో తీవ్రంగా వణుకుతూ, మానసిక వికలాంగతతో బాధపడుతున్న ఓ వృద్ధుడు రహదారి పక్కనే పడుకొని మలమూత్ర విసర్జన కూడా అక్కడే చేసుకుంటూ అతి దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నాడు. ఈ విషయాన్ని గమనించిన రాజేంద్రనగర్ సర్కిల్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి వెంటనే స్పందించి మానవత్వానికి ప్రతీకగా నిలిచారు. ఆ వృద్ధుడి పరిస్థితిని చూసి చలించిపోయిన ఆమె, సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేసి తక్షణమే అతడిని రక్షించే చర్యలు చేపట్టారు. వృద్ధుడిని శుభ్రపరచి, అవసరమైన సంరక్షణ కల్పించి, అనంతరం అతడిని "అమ్మ నాన్న ఆశ్రమం" కు తరలించి శాశ్వత ఆశ్రయం కల్పించారు. రహదారిపై నిరాశ్రయంగా ఉన్న వృద్ధుడికి భద్రతతో కూడిన జీవనాన్ని అందించడంలో స్వాతి కీలక



పాత్ర పోషించారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ, "సమాజంలో ఎవరూ ఆకలితో, చలిలో, నిరాశ్రయంగా ఉండ కూడదు. ముఖ్యంగా వృద్ధులు, మానసిక వికలాంగులు సంరక్షణ పొందడం ప్రతి అధికారితో పాటు ప్రతి పౌరుని బాధ్యత. అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన సేవ" అని అన్నారు. స్వాతి చూపిన ఈ సేవా భావనపై స్థానికులు, సామాజిక కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు. ప్రభుత్వ అధికారులు



కూడా విధుల్లో ఉండగానే కాకుండా మానవత్వంతో స్పందించాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి చాటిందని వారు అభిప్రాయ పడ్డారు. ఈ ఘటన ద్వారా సమాజంలో ఉన్న నిరాశ్రయుల పట్ల బాధ్యత, కరుణ ఎంత ముఖ్యమో స్పష్టమవుతుండగా, స్వాతి చేసిన చర్యలు ఇతరులకు ఆదర్శంగా నిలిచాయి.

# అధికార పార్టీలోకి వెళ్లినా అభివృద్ధి శూన్యం

### - ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌పై బిఆర్ఎస్ నేత కార్తిక్ రెడ్డి తీవ్ర విమర్శలు

**మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):** స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అధికార పార్టీలోకి వెళ్లిన తర్వాత కూడా నియోజకవర్గానికి ఎలాంటి అభివృద్ధి జరగలేదని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కార్తిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల ఫలితాలే రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ ఉనికి ఉందా? మనుగడ కొనసాగుతుందా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఇచ్చాయని కార్తిక్ రెడ్డి అన్నారు. రానున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో బిఆర్ఎస్ తన సత్తాను మరింత బలంగా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు.

నాలుగు సార్లు ప్రజలు విశ్వాసంతో గెలిపించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను ఇప్పుడు తమ ఎమ్మెల్యేగా చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యక్రమాల్లో తిరుగుతూ, కాంగ్రెస్ ఫ్లెక్సీల్లో కనిపిస్తూ కూడా తాను బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనని చెప్పుకోవడం ప్రజలను అగౌరవపరచడమేనని వ్యాఖ్యానించారు.. "కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లినట్లయితే ధైర్యంగా చెప్పాలి. కానీ నియోజక




వర్గ ప్రజలను మోసం చేయడం తగదు" అని ఆయన అన్నారు. రెండు సంవత్సరాల క్రితం బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత శంషాబాద్‌కు ఏం అభివృద్ధి జరిగిందో ప్రజలకు వివరించాలని సవాల్ విసిరారు. శంషాబాద్ నడి బొడ్డున రావాల్సిన మెట్రో ప్రాజెక్ట్ ఎటు పోయిందని ప్రశ్నించారు. అలాగే శంషాబాద్ మున్సిపాలిటీ చుట్టుపక్కల గ్రామాలను గ్రేటర్ హైదరాబాద్‌లో కలిపి గ్రామీణ ప్రజలపై అదనపు పన్నులు, భారాలు మోపారని ఆరోపించారు. దీని వల్ల గ్రామీణ వాతావరణం దెబ్బతిని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యే ప్రజలకు మేలు చేయాల్సింది పోయి, గ్రామీణ ప్రాంతాల అస్తిత్వానికే ముప్పు తెచ్చారని కార్తిక్ రెడ్డి అన్నారు. శంషాబాద్ నియోజకవర్గ ప్రజలు ఈ విషయాలను గమనిస్తున్నారని, తగిన సమయంలో సరైన సమాధానం ఇస్తారని స్పష్టం చేశారు.

# ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడలే ప్రధానం

### - తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. దండా రాజిరెడ్డి

**మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 18(వార్త వేదిక సూర్య):** జీవితంలో ఒడిదుడుకులు సహజమని, తాము ఎంచుకున్న రంగాల్లో విజయం సాధించాలంటే ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేయా ల్సిన అవసరం ఉందని, అందుకు క్రీడలు ముఖ్యమైన పాత్ర పోషి స్తాయని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యమం విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి పేర్కొన్నారు.

రాజేంద్రనగర్‌లోని ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న రాజ్యం ఉద్యాన కళాశాల వేదికగా 18, 19 తేదీల్లో నిర్వహించనున్న యూనివర్సిటీ స్థాయి మొట్టమొదటి బోధన, బోధనేతర సిబ్బంది ఆటలు, క్రీడలు, సంస్కృతిక మరియు వైజ్ఞానిక పోటీలను ఆయన జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్వవి ద్యాలయంలో విద్యార్థులతో పాటు సిబ్బందికి మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొం దించే అన్ని సౌకర్యాలు కల్పించేందుకు యూని వర్సిటీ పూర్తిగా సిద్ధంగా ఉందన్నారు. వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలు, ఉద్యాన పరిశోధనా సంస్థల్లో అవసర మైన క్రీడా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఉద్యోగంలో విజయం సాధించాలంటే ఒత్తిడి అనివార్యమేనని, అయితే ఆ ఒత్తిడిని జయించేం దుకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్ర మాలు ఎంతో అవసరమని డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్ట వారంలో యూనివర్సిటీ స్థాయి పోటీలు తప్పకుండా నిర్వహిస్తామని సిబ్బందికి హామీ ఇచ్చారు.

డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జె. చీనా మాట్లాడుతూ, ఈ పోటీల్లో 12 రకాల క్రీడలు, 10 సంస్కృతిక మరియు వైజ్ఞానిక అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశోధన, బోధనతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వా లని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ. భగవాన్ సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ డి. లక్ష్మీనారాయణ, యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ ఎం. రాజశేఖర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎన్. శ్రీనివాసన్, అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రశాంత్, ప్రొఫెసర్ పి. సైదయ్య, వీణ జోషి, డాక్టర్ పీతంగౌడ్, పోతురాజు యాదయ్య, చెంచురామయ్యతో పాటు




మొత్తం 124 మంది మహిళా, పురుష సిబ్బంది పాల్గొన్నారు.

# మోతెలో బీఆర్ఎస్‌కు గట్టి షాక్..

### ఏకపక్ష నిర్ణయాలపై అసంతృప్తితో భారీ రాజీనామాలు

**మోతే, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):** మోతె మండల పరిధిలోని రాఘవపురం ఎక్స్‌రోడ్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గ్రామంలోని పార్టీ నిర్ణయాలు పూర్తిగా ఏకపక్షంగా ఉండటం, కార్యకర్తల అభిప్రాయా లకు విలువ లేకపోవడంపై తీవ్ర అసంతృప్తితో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు కారింగుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేశారు.

ఈ రాజీనామాల్లో మాజీ ఎంపీటీసీ బాణోత్ మధు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు బొర్రాజు రాములు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కే సైద, మహిళా సమితి నాయకురాలు మద్ది శాంతమ్మ, ఆటో యూనియన్ అధ్యక్షుడు పాలకురి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. వీరంతా పార్టీ పదవులతో పాటు సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

గ్రామాభివృద్ధి, ప్రజాసమస్యలపై పార్టీ పెద్దలు స్పందించక పోవడం, స్థానిక నాయకుల సూచనలను పక్కనపెట్టి నిర్ణయాలు తీసుకోవడమే ఈ పరిస్థితికి కారణమని రాజీనామా చేసిన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీని నడిపించిన కీలక నేతలు ఒకేసారి బయటకు రావడం మోతె మండల




రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసే అవకాశముందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



గోరుపల్లి శ్రీనివాస్ రెడ్డి
(అనాజిపురం ఉప సర్పంచ్)



బండ పెద్ద లింగయ్య
(పొడిచేడు ఉపసర్పంచ్ )



బిమన బోయిన అవిలయ్య
(దాచారం ఉప సర్పంచ్)



నోముల అంజయ్య
(ముశిపట్ల ఉపసర్పంచ్)



ఇటికాల ఎల్లమ్మ
(దత్తప్పగూడెం ఉపసర్పంచ్ )



పానుగళ్ళ లక్ష్మి బి రమేష్
(రాగి బావి ఉపసర్పంచ్)

# ప్రశాంతంగా ముగిసిన ఉప సర్పంచుల ఎన్నిక

మోత్కూరు, డిసెంబర్18 (వార్త వేదిక సూర్య): మండలంలోని 10 గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం నాడు. ఆయా గ్రామాలల్లో ప్రశాంతంగా కొనసాగింది. వివిధ గ్రామాల ఉప సర్పంచులు పనకబండ రాదారపు మల్లేశం (బి. జె.పి) రాగిబావి పానుగళ్ల లక్ష్మీ, రమేష్ ( సిపిఎం) ముషిపట్ల నోముల అంజయ్య (కాంగ్రెస్ ) దత్తప్పగూడెం ఇటికాల ఎల్లమ్మ (కాంగ్రెస్) పొడిచేడు బండ పెద్ద లింగయ్య ( కాంగ్రెస్ ) దాచారం భీమనబోయిన అవిలయ్య (కాంగ్రెస్ ) సదర్శాపురం తీగల వినోద్ (కాంగ్రెస్ రెబల్ ) అనాజీపురం గోరుపల్లి శ్రీనివాస్ రెడ్డి (కాంగ్రెస్)పాటిమాట్ల దండబోయిన సత్తయ్య, పాలడుగు దడిపల్లి సైదులు (కాంగ్రెస్) ఎన్నికైనట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు.





## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే

# కాంగ్రెస్ సర్పంచుల విజయానికి తోడ్పాటు

మోత్కూరు, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య): రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే గీటురాయిగా నిలిచి తుంగతుర్తి నియోజకవర్గంలో 155 గ్రామాలకు 7 గ్రామాలు ఏకగ్రీవం అయ్యాయని,మిగతా వాటిలో 110 గ్రామాలల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులే గెలిచారని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. గురువారం నాడు స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సామేల్ మాట్లాడుతూ రేవంత్ ప్రజాపాలనలో స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. మోత్కూరు మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తున్నారని అందులో భాగంగానే దత్తప్పగూడెంలో చెక్ డ్యామ్ కృంగిపోయిందని తెచ్చారని ఈ అంశాన్ని త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుక పోయి అ చెక్ డ్యామ్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. స్థానిక సేక్రెట్ హార్ట్ హైస్కూల్ ప్రక్కన ఉన్నటువంటి నాలుగు ఎకరాల భూమి విషయంలో హైకోర్టు ప్రభుత్వ భూమి అని తీర్పునిచ్చిందని ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానని అతి తొందరలోనే వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

మున్సిపల్ పరిధిలోని బుజిలాపురంలో ఈనెల 19న సోలార్ ప్రాజెక్ట్ ను కలెక్టర్‌తో కలిసి ప్రారంభిస్తామన్నారు. గత 6ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీ మోత్కూరును సందరికరణంగా తీర్చిదిద్దుతామన్నారు.

మోత్కూరు, తిరుమలగిరి మున్సిపాలిటీలకు పబ్లిక్ హెల్త్ నిధులు నుంచి 15 కోట్ల రూపా యలు మంజూరైనట్లు తెలిపారు.ఈ నిధులతో అన్ని ప్రాంతాలకు సిసి రోడ్లు ఇతర పనులకు ఉపయోగించుకోవచ్చని అన్నారు. అనంతరం మండలంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన సర్పంచ్ అభ్యర్థులు కర్నే జ్యోతి (దాచారం) బీసువెంకటయ్య (అనాజిపురం) పైళ్ల నర్సిరెడ్డి (ముశి పట్ల) బండ రమ (పాటిమట్ల) జిట్ట సైదులు ( పొడిచేడు)లను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు .ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు పైళ్లసోమిరెడ్డి , జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం లక్ష్మీ నర్సింహ్మారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్ , స్థానిక నాయకులు బయ్యని రాజు, పోలినేని స్వామి రాయుడు కారుపోతుల శ్రీనివాస్ పల్లపు సమ్మయ్య , సోషల్ మీడియా మండల, పట్టణ కన్వీనర్లు బందెల రవి, పాలోజు శేఖరాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఏ.హెచ్.టి.యు.ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు

ఎల్ బి నగర్, డిసెంబర్ 18(వార్త వేదిక సూర్య): రాచకొండ పోలీస్ కమీషనర్ గారి ఆదేశానుసారం, రాచకొండ యస్.ఓ.టి. ఎల్.బి.నగర్ ఇంచార్జ్ అడిషనల్ డి.సి.పి. యం.డి.







షాకీర్ హుసేన్ గారి సూచనల మేరకు రాచకొండ ఏ.హెచ్.టి.యు. వారి ఆధ్వర్యంలో, అబ్దుల్లాపూర్ మెట్ పోలీసు స్టేషన్ పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహనా సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాచకొండ ఏ.హెచ్.టి.యు. SI s జి.వెంకట శ్రీను, కే. రాములు, ఎం డి. ఖలీల్ అహ్మద్, ASI. జి. రంగా రెడ్డి, మరియు మహిళా ASI. శ్రీమతి సి. మీనా కుమారి, వారి ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగినది ఈ సదస్సులో SI.కే. రాములు, విద్యార్థిని, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాల కార్మికులు, నిర్భంధ కార్మికులు గురుంచి, బాల బాలికలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, బాలికలను, మహిళలను మోసపూరితంగా లేదా బలవంతంగా అపహరించి బలవంతపు వ్యభిచారం చేయించడం, బాలలను అమ్మడం అమ్మివారితో, బిక్షాటన చేయించడం, బాలికలను వేధించడం, సైబర్ క్రైమ్స్ చేయించడం, అవయవాల మార్పిడికి వీళ్ళను ఉపయోగించడం మరియు మహిళలకు ప్రయాణంలో టి.సేఫ్ అప్లికేషన్ ఉపయోగించడం, రోడ్డు భద్రత, మత్తు పదార్థాల వాడకం, కొత్త చట్టాలు అయిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష, భారతీయ సాక్ష్యా అధినియమ్ లపైన అవగాహన కల్పించారు. సైబర్ బెదిరింపులు, సైబర్ మోసాలకు గురి అయితే డయల్-1930, ఉమెన్ హెల్ప్ లైన్-1091, 181, చైల్డ్ హెల్ప్ లైన్-1098/112, డయల్-100 వంటి విభిన్న సేవల కోసం వేర్వేరు నంబర్లను ప్రజలు ఉపయోగించేవారు. అయితే ఇప్పుడు వీటి స్థానంలో ఒక్కటే నంబర్ - 112 కొనసాగనుంది. ఈ మార్పుతో అన్ని అత్యవసర సేవలకు వేగంగా, సమర్థవంతంగా స్పందించడం జరుగుతుంది. ఈ సదస్సులో పోలీసు శాకతో పాటు స్కూల్ ప్రిన్సిపల్, జె. రమేశ్ కుమార్, మరియు టీచర్లు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి సంక్షేమ పథకంగా మార్చే

# కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి

మోత్కూరు, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య): కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 ను రద్దు చేసి 2025 పేరుతో 197 బిల్లును తీసుకురావడాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని,ఈ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని, ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు .

గురువారం నాడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మోత్కూరు పట్టణ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన అజీవిక మిషన్ (గ్రామీణ) 2025 బిల్లు ప్రతులను దగ్ధం చేయడం చేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ దేశంలో అనేకమంది గ్రామీణ ఉపాధి హామీ చట్టం జీవన పోరాటం చేస్తున్నారని, ఈ పథకాన్ని ఎందుకు రద్దు చెయ్యబోతున్నారో మోడీ సమాధానం చెప్పాలన్నారు. ఈ నూతన బిల్లు ఉన్న పేదలకు ఉపాధిని లేకుండా చేస్తుందన్నారు.ఉపాధి హామీ పనులు ఫిబ్రవరి 20 నుండి జూన్ 20 వరకు 75% కు పైగా జరుగుతాయని, ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని ఈ లెక్కన వ్యవసాయ పనులు పెద్దగా లేని సమయంలో రైతులకు ఎం ఎస్.పి పంట పెట్టుబడి నుండి తప్పించు కోవడానికి ప్రయత్నం చేస్తుందన్నారు.

పేదలకు నిరంతరంగా ఉపయోగపడే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టమే యధావిధిగా కొనసాగించాలని యాదగిరి



కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాచకొండ రాములమ్మ, , మండల కార్యదర్శి మెతుకు అంజయ్య,, పట్టణ కమిటీ సభ్యులు కందుకూరి నర్సింహ్మా గుండు లక్ష్మి, బాలమణి, సంధ్య, సావిత్రి, నాగమణి, నర్సింహ్మా, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.






## ఈనెల 20 నుంచి కేరళలో ఇండియన్ కల్చరల్

# కాంగ్రెస్ సాహిత్య ఉత్సవాలు

### సుద్దాల అశోక్ తేజకు ఆహ్వానం

మోత్కూరు, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య): ఇండియా కల్చరల్ కాంగ్రెస్ సాహిత్య ఉత్సవాలకు కేరళలో ఈ నెల 20 నుంచి 22వరకు నిర్వహించే ఈ ఉత్సవాలకు కేరళ ప్రభుత్వం తనను ఆహ్వానించిందని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తన రచనలను కేరళ ప్రభుత్వ గుర్తించి ఈ ఉత్సవాలకు ఆహ్వానించడం హర్షించదగ్గ విషయమన్నారు.

# నేడు మోత్కూరుకు ఎమ్మెల్యే రాక

మోత్కూరు, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య): మోత్కూరు మున్సిపల్ పరిధిలోని బుజిలా పురం గ్రామ దేవాలయ స్థల పరిధిలో మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ నిర్వహిస్తున్న సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు ఈ నెల 19 ఉదయం 10:30 శంకుస్థాపన, అనంతరం 11బీ00 గంటలకు స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రభుత్వ స్థలంలో మినీ స్టేడియం ,పహారి గోడ నిర్మాణ పనులకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శంకుస్థాపన లు చేయనున్నట్లు మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గుర్రం కవిత బిబి లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్రుగౌడ్ గురువారం ఒక ప్రకటన తెలిపారు.



## సర్పంచ్ కంభంపాటి శ్రీనివాస్‌ని

# అభినందించిన కేటీఆర్

రామన్నపేట, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన బిఆర్ఎస్ పార్టీ నూతన సర్పంచులను ఉప సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట తారక రామారావు పాల్గొని పల్లివాడ నూతన సర్పంచ్



కంభంపాటి శ్రీనివాస్ ని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లలోని కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని బిఆర్ఎస్ పట్ల ఆదరణ పెరిగిందని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నేటికి అమలు కాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి, మాజీ నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం సర్పంచులకు సన్మానం

రామన్నపేట, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య): ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రచారంజక పాలన చేసి గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి అన్నారు. రామన్నపేట మండలంలో సిపిఎం బలపరిచిన మునిపంపుల,దుబ్బాక గ్రామాల సర్పంచులు బొడ్డుపల్లి వెంకటేశం, గట్టు నర్సింహా ను స్థానిక సిపిఎం కార్యాలయంలో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో డబ్బు,మద్యం ప్రలోభాలు మితి మీరి పోతున్న తరుణంలో ప్రజలను



ప్రలోభపెట్టకుండా పోరాటలే పెట్టుబడిగా గెలవడం అభినందనీయమని అన్నారు. ప్రజల సమస్యలను అనునిత్యం అధ్యయనం చేసి పరిష్కారం కొరకు చొరవ చూపాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన పేదలకు దక్కే విధంగా చూడాలని అర్హులైన వారికి ఇండ్లు, పెన్షన్స్, రేషన్ కార్డులు అందించి గ్రామాలను కమ్యూనిస్టు కోణంలో ఆదర్శంగా నిలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలోగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాగిరు కిష్టయ్య, సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు బోయని ఆనంద్,మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగే సోములు,మండల కమిటి సభ్యుడు మేడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.






## కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి

**ఆత్మకూరు (ఎం),డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ మద్దతుదారులు సర్పంచులు గా గెలిచిన సందర్భంగా మాజీ మంత్రి,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ కొప్పులు హరిదీప్ రెడ్డి కేటీఆర్ ని మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా,మండల నాయకులు పాల్గొన్నారు.

## కేటీఆర్ ప్రశంసలు అందుకున్న నూతన సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్

**ఆత్మకూరు (ఎం),డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ మద్దతుదారులు సర్పంచులుగా గెలిచిన సందర్భంగా మాజీ మంత్రి,బీఆర్ఎస్



వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, ఆత్మకూరు పట్టణ నూతన సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా,మండల నాయకులు పాల్గొన్నారు.

## కేటీఆర్ ప్రశంసలు అందుకున్న నూతన సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి

**ఆత్మకూరు (ఎం), డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ మద్దతుదారులు సర్పంచులుగా గెలిచిన సందర్భంగా మాజీ మంత్రి,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం



నిర్వహించారు.వైస్సార్ ఫౌండేషన్ అధినేత, లింగరాజుపల్లి నూతన ఎర్ర సోమిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లు,జిల్లా,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్‌ల ఎన్నిక

**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):**
మండలంలోని జిబ్లక్ పల్లి గ్రామ ఉప సర్పంచ్‌గా ఆర్ల లింగస్వామి యాదవ్, ఇంద్రియాల ఉప సర్పంచ్ గా రేవల్లి అశోక్,మెహర్ నగర్ ఉప సర్పంచ్‌గా కేసారం పూజా సంపత్ రెడ్డి,లను ఎన్నుకున్నారు.



ఆర్ల లింగస్వామి యాదవ్ (జిబ్లక్‌పల్లి)



రేవల్లి అశోక్, (ఇంద్రియాల)



కేసారం పూజ (మెహర్ నగర్)

## ఉపాధిని నిర్వీర్యం చేసేందుకు కుట్ర
# కూలీలతో కలిసి జీఓ ప్రతులు దగ్ధం

**దండంపల్లి సరోజ మహిళా కూలీలా జిల్లా కన్వీనర్**

**నల్లగొండ,డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):**
మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర సర్కార్ కుట్ర పన్నుతోందని, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ అన్నారు. గురువారం నల్గొండ పట్టణంలోని 11వ వార్డులో మహిళా కూలీలతో కలిసి ఉపాధి హామీ పథకం పేరు మారుస్తూ తెచ్చిన 197 జీవోను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సరోజ మాట్లాడుతూ.. ఉపాధి చట్టాన్ని ప్రధాని మోదీ ప్రభుత్వం 2025 పేరుతో 197 ఉపాధి బిల్లును తేవడంతో కూలీల జీవనోపాధి కోసం ఏర్పడిన ఈ చట్టాన్ని పథకంగా మార్చి కూలీలను పనికి దూరం చేయడమేనన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి పథకానికి అరకొర నిధులు కేటాయిస్తూ క్రమ క్రమం గా నీరుగారుస్తున్నారన్నారు. ఉపాధి పథకం అమలుకు ఇప్పటి వర కు కేంద్రం 90 శాతం నిధులు, రాష్ట్ర వాటా 10 శాతంగా ఉండేదని, అయితే ఈ కొత్త బిల్లు ద్వారా ఇక నుంచి రాష్ట్రాలు 40 శాతం, కేం ద్రం 60 శాతం మాత్రమే నిధులు చెల్లించనుందన్నారు. తద్వారా రాష్ట్రాల్లో నిధులు లేక ఈ పథకం నీరుగారిపోయే అవకాశం ఉందన్నారు. మోదీ కుట్రలను తిప్పికొడుతూ 197 బిల్లును రద్దు చేసే వర కు పోరాటం సాగిస్తామని సరోజ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల సమన్వయ కమిటీ పట్టణ ఉపాధ్యక్షురాలు మొగిలిపాలపు ఇందిరా, సభ్యులు గడిగల సత్తెమ్మ, నర్సింగ్ నిర్మల, బత్తుల కాశమ్మ, బోయపల్లి స్వాతి, చిత్తలూరి అలివేలు, దూదిమెట్ల లింగమ్మ, కదిరి జ్యోతి, అరుణ, కళ్యాణి ,సుజాత, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**నల్లగొండ,డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):**
నల్గొండ పట్టణంలోని ఎస్ఎల్బీసీ ప్రాంతంలో గల ఫాదర్ పేజీని బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ వేడుకలలో భాగంగా పాఠశాల చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. నల్లగొండ పట్టణంలోని ఎస్ఎల్బీసీ ప్రాంతంలో గల ఫాదర్ ఫెజ్జోని బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాలలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించు కున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదులుగా ప్రముఖ యూట్యూబ్ ఇన్ఫ్లుయెన్సర్, ఐబీసీ ఛానల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏచూరి శైలజ, గురుకుల పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు స్వామి, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కౌన్సిల్ ప్రతినిధి పసల శౌరయ్య విచ్చేసి పాఠశాల చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి అభినందించారు. ఈ వేడుకలలో భాగంగా పాఠశాల నిర్వాహకురాలు, ఇన్చార్జి సిస్టర్ ఆగ్నేష్, సిస్టర్ లీమా, సిస్టర్ గోరెట్టి రూపొందించిన బాల యేసు జననం ప్రతిబింబించేలా అద్భుతమైన అలంకరణ పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రముఖ యూట్యూబ్ ఇన్ఫ్లుయెన్సర్, ఐబీసీ ఛానల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏచూరి శైలజ మాట్లాడుతూ ఫాదర్ ఫెజ్ఓని సేవలను కొనియాడారు. వారు స్థాపించిన ఈ సంస్థల ద్వారా మంచి సేవలు విస్తరించాలని, చిన్నారుల ప్రతిభ ప్రాచుర్యంలోకి రావాలని, ఎందుకు తన వంతు సహకారాన్ని అందిస్తారని హామీ ఇచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.




ఈ కార్యక్రమంలో లెప్రసీ హెల్త్ సెంటర్ సంస్థ డైరెక్టర్ సిస్టర్ అంబిక, ఎఫ్ ఎస్ ఐ సిస్టర్స్ సిసిలి, జెరోసా, ఆరోగ్య, రోజ్, ఈవా, సిస్టర్ సుపీరియర్ ఎల్సి, సిస్టర్ దనయా, తదితరులు పాల్గొన్నారు.






## ఎమ్మెల్యే సంజయ్ ఆధ్వర్యంలో టీ హబ్ & టీ వర్క్స
# సందర్శించిన డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు

**కోరుట్ల, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):**
కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి - కోరుట్ల డిగ్రీ కళాశాలకి చెందిన విద్యార్థిని, విద్యార్థులు హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక టీహబ్ & టీ-వర్క్స్‌ను సందర్శించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతు..

విద్యే నిజమైన సంపద అని,డిగ్రీ పూర్తిచేయడమే లక్ష్యం కాకుండా, నైపుణ్యాలు పెంచుకొని అవకాశాలను సృష్టించుకోవాలి అని సూచించారు.టీ-హబ్ టీ-వర్క్స్ కల్పిస్తున్న స్టార్టప్, స్కిల్ డెవలప్‌మెంట్ అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని తెలిపారు.

టీ-హబ్ & టీ-వర్క్స్‌లో స్టార్టప్‌లు ఎలా ప్రారంభమవుతున్నాయో కొత్త ఆలోచనలు పరిశ్రమలుగా ఎలా మారుతున్నాయో, యువతకు అక్కడ లభిస్తున్న శిక్షణ, సాంకేతిక మద్దతు ఎలా ఉంటుందోవిద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు..

ఈ సందర్భన విద్యార్థుల్లోఆత్మవిశ్వాసం పెంచిందని కొత్త ఆలోచనలకు ప్రేరణనిచ్చిందని భవిష్యత్తులో ఉద్యోగం కోరుకునే స్థితి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలనే ఆశయాన్ని నింపిందని విద్యార్థులు తెలిపారు..విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధచూపుతూ,గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ప్రపంచ స్థాయి అవకాశాలను అందుకోవాలనే సంకల్పంతోఇలాంటి విద్యా -ప్రయోజనకర కార్యక్రమాలను చేపడుతున్నకోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కి విద్యార్థులు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు..

# ధాన్యం కొనుగోలు వివరాల రికార్డులను పక్కగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నల్లగొండ,డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య):**
ధాన్యం కొనుగోలు వివరాల రికార్డులను పక్కగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహా కులను ఆదేశించారు. గురువారం ఆమె నల్గొండ జిల్లా, అనుముల మండలం, కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.ఇప్పటివరకు కొత్తపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను, రిజిస్టర్లను తనిఖీ చేసి పరిశీలించారు. ధాన్యం అమ్మిన రైతులకు ఇచ్చిన రశీదులు, వచ్చిన దాన్యం, క్రమ సంఖ్య ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల ద్వారా మిల్లులకు పంపించిన వివరాలు, తేమశాతం, తూకం, తదితర వివరాలన్నింటిని రికార్డుల ద్వారా పరిశీలించారు.



కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం వివరాలతో పాటు, ప్రతిరోజు తేమ కొలిచిన వివరాలను,కొనుగోలు చేసి మిల్లులకు పంపించిన వివరాలను పక్కగా నిర్వహించాలని , రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో జాప్యం చేయకుండా ఎప్పటి దాన్యాన్ని అప్పుడే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని, తేమ, తాలు, తరుగు వంటి వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించి నాణ్యత ప్రమాణాలతో వచ్చిన వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపుల విషయంలో జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని, అలాగే డబ్బులు చెల్లించిన రైతుల వివరాలు సైతం నమోదు చేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

## నల్గొండ జిల్లాలో జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల పోటీకి

# బిఎస్‌పి పార్టీ అభ్యర్థులు సిద్ధం

**- జిల్లా అధ్యక్షులు రావులపాటి రవి శంకర్**



నల్లగొండ,డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య): బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రం శేఖర్ ఆదేశానుసారం ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సమన్వయకర్త మంచాల శ్రీకాంత్ సూచనల మేరకు నల్గొండ జిల్లా లోని అన్ని మండలలో బి ఎస్ పి పార్టీ ఏనుగు గుర్తుపై జడ్ పి టి సి, ఎం పి టి సి అభ్యర్థులు పోటీకి సిద్ధంగా ఉన్నట్లు జిల్లా అధ్యక్షులు రావులపాటి రవిశంకర్ తెలిపారు. గురువారం నల్లగొండ పట్టణంలోని సవేర హొటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సర్పంచ్ ఎన్నికలోరాష్ట్ర, జిల్లా నాయకత్వానికి సమాచారం లేకుండా బి ఆర్ ఎస్, బి జె పి, టి డి పి, కాంగ్రెస్, పార్టీలతో లోకల్ బాడీ ఎన్నికల లో పోటీ చేస్తూ, పని చేస్తున్నందుకు గాను పార్టీ క్రమశిక్షణ చర్యల కింద పార్టీ యొక్క వీధి, విధానాలకు వ్యతిరేకంగా పని చేసిన ఎర్ర యాదయ్య, నల్ల రాజేష్,పెరుపాక శ్రావణ్ కుమార్,ఐతరాజు సరళ చెంద్రయ్య, పులకరం నరేష్ ,అయిత అభయందర్, గద్ధపాటి రమేష్,లను పార్టీ పదవి నుండి సస్పెండ్ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇంచార్జీ బొడ్డు కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుపాక లింగస్వామి, వట్టపాక యాదయ్య, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నాంచారి పేట సర్పంచ్ బెల్లి మల్లేష్ యాదవ్‌కి

# శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్

మోటకొండూర్, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య): యాదాద్రి భువనగిరి జిలాల్లో గెలుపొందిన బిఆర్ఎస్ సర్పంచ్ లకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చే సన్మాన కార్యక్రమంలో భాగంగా నాంచారి పేట గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి పై గెలిచిన బి ఆర్ఎస్ అభ్యర్థి బెల్లి మల్లేశ్ యాదవ్ కి బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేటీఆర్ సన్మానించి షీల్డ్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కంది వెంకట్ రాంరెడ్డి మాజీ ఎంపీపీ పైళ్ల ఇందిరా సత్యనారాయణరెడ్డి బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు పైళ్ల దయాకర్ రెడ్డి ఎలిమినేటి రాంరెడ్డి పైళ్ళ నారాయణరెడ్డి పీసరి మల్లారెడ్డి పోతగాని వెంకటేష్ దేవల్ల నరసింహ పోతగాని సత్యనారాయణ యాదయ్య గంధమల్ల కరుణాకర్ గణగణ నాగరాజు గంధమల్ల ఇస్తారి బచ్చే పర్వతాలు కప్పే సబితా మల్లేష్ వరికుప్పల కవిత దేవేందర్ తదితరులు పాల్గొన్నారు



## అధికారిగా కాదు...

# ప్రజా సేవకుడిగా గుర్తింపు పొందాలి

- మార్పు, గౌరవం తీసుకొస్తే మీరు విజయం సాధించినట్టే...
- నిజాయితీగా సేవ చేయండి ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి
- సివిల్ సర్వీస్ అధికారుల శిక్షణ ముగింపోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్, (వార్తా వేదిక సూర్య):

ప్రజలు మిమ్మల్ని ఒక అధికారిగా మాత్రమే కాకుండా ప్రజాసేవకుడిగా గుర్తుపెట్టుకోవడం వల్లనే సివిల్ సర్వీసెస్ హొదాకు న్యాయం చేయగలిగిన వారుగా నిలిచిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో గురువారం ఆల్ ఇండియా సర్వీసెస్, సెంట్రల్ సర్వీసెస్ అధికారులు 10 వారాల శిక్షణ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు డిప్యూటీ సీఎం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంసీఆర్‌హెఆర్డీ వైఎస్ ఛైర్ పర్సన్ శాంతకుమారి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రతిరోజు కార్యాలయాన్ని వదిలి వెళ్లే ముందు మిమ్మలని మీరు ఒక ప్రశ్న వేసుకోండి.. మీ పని ద్వారా ఎవరి జీవితంలో అయినా ఒక మంచి మార్పు, గౌరవాన్ని తీసుకువచ్చిందా ప్రశ్నించుకోండి? అవును అని సమాధానం వస్తే.. ఆరోజు మీరు ఎంత కఠినపరిస్థితుల్లో విధి నిర్వహణ చేసినా.. మీరు విజయం సాధించినట్టేనని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. నిజాయితీతో సేవ చేయండి.. ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి.. మానవత్వంతో వ్యవహరించండి.. నాయకత్వంతో ముందుకు సాగండి.. అని శిక్షణలో ఉన్న అధికారులకు భట్టి విక్రమార్క సూచించారు.

కఠినమైన శిక్షణా కార్యక్రమం ముగిసిపోయి.. బాధ్యత, వివేకం, విచక్షణ, ప్రజా విశ్వాసంతో కూడిన కొత్త ఆరంభాన్ని అందిస్తోందని అన్నారు. అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన 203 మంది అధికారులు ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్నారు.

ఈ సందర్భంగా వారందరికీ ఉప ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఇక్కడకు మీరంతా ఇంజినీర్లు, వైద్యులు, ఆర్థిక నిపుణులు, న్యాయవాదులు, సాంకేతిక నిపుణులుగా వచ్చారు... ఇక్కడనుంచి అత్యున్నత స్థాయి గుర్తింపు, గౌరవంతో బయటకు వెళుతున్నారు. మీ ప్రతిభకు అర్హతలకు అనేక అవకాశాలు మీ ముందున్నాయని డిప్యూటీ సీఎం అన్నారు.

ఈ రోజు కేవలం ఆనందపడే కార్యక్రమం మాత్రమే కాదు. ఇక్కడనుంచి బాధ్యతలు, బదిలీలు, క్లిష్టమైన సమస్యలు, ప్రజలకు సంబంధించిన ఫైళ్లు, ఉంటాయి. మీరు సరైన సమయంలో స్పందించాల్సిన అంశాలు ఉంటాయి. విధి నిర్వహణలో మీరు నిర్లక్ష్యంతో తీసుకునే ఒక నిర్ణయం ఒకరి జీవితాన్ని ఏళ్లపాటు ప్రభావితం చేయగలదు.. అందువల్ల నిబద్ధతతో విధి నిర్వహణ చేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

పాలనలో ఒత్తిడి, కఠినమైన సందర్భాలు, మానవీయతతో కూడిన నిర్ణయాలు, ప్రజాశ్రేయస్సు కోసం శ్రమించే సందర్భాలు.. ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ప్రశంశలు, విమర్శలు కూడా వస్తాయి. అన్నింటిని.. ప్రజల కోసమే అన్నభావనతో ముందుకు వెళ్లాలని ఆయన చెప్పారు.

యువ సివిల్ సర్వెంట్స్ గా అడుగు పెడుతున్న ఈ సమయం.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగవంతంగా అభివృద్ధిని సాధిస్తోంది. మీరు ప్రజాసేవలోకి అడుగుపెడుతున్న ఈ సమయం వేగవంతమైన మార్పుల కాలం, టెక్నాలజీ పాలన రూపు రేఖలు మారుస్తోంది అన్నారు. సోషల్ మీడియా విజయాలను, తప్పిదాలను రెండింటినీ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ప్రపంచ ఆర్థిక, వాతావరణ, భౌగోళిక, రాజకీయ షాకులు ముందస్తు హెచ్చరిక లేకుండా వస్తున్నాయి అని డిప్యూటీ సీఎం వివరించారు.

ప్రజలు మరింత సమాచారం కలిగి ఉన్నారు. అదేవిధంగా ప్రశ్నిస్తున్నారు.. కారణాల పట్ల చాలా అసహనంగా ఉన్నారన్నారు. మీరు నిరంతరం నేర్చుకోవాలి.. అవసరమైతే పాత విషయాలను వదలిపెట్టాలి. ఎప్పటికప్పుడు మార్పులకు అనుగుణంగా రూపాంతరం చెందాలని శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు.

ఈ మారుతున్న ప్రపంచంలో మూడు అంశాలు మాత్రం ఎప్పటికీ మారకూడదన్నారు. చరిత్ర,

నమ్మకత్వం, కరుణ, ఇవి మృదువైన విలువలు కావు. ఒక అధికారి సంపాదించగలిగే అత్యంత కఠినమైన ఆస్తులు ఇవే, అదే సమయంలో కోల్పోవడం కూడా అత్యంత సులభమైనవే అన్నారు. ఉద్యోగం ప్రారంభ దశలో అధికారం అంటే ప్రాముఖ్యత అని పొరపాటు పడటం సులభం, దయచేసి ఇది గుర్తుంచుకోండన్నారు.

అధికారాన్ని మీరు సొంతం చేసుకోరు. మీరు దాన్ని నమ్మకంగా





నిర్వహిస్తారు. రాజ్యాంగం నుంచి, చట్టం నుంచి, చివరికి ప్రజల నుంచి. మీరు పౌరుల కంటే పైగా ఉంచబడలేదు. విధానం, వాస్తవం మధ్య, రాష్ట్రం, అత్యంత బలహీనమైన పౌరుడి మధ్య మీరు నిలబెట్టబడ్డారు అన్న వాస్తవాన్ని గుర్తించాలని డిప్యూటీ సీఎం తెలిపారు. మీ విజయాన్ని మీరు జారీ చేసిన ఉత్తర్వుల సంఖ్యతో కొలవరు.

మీరు అక్కడ ఉండటం వల్ల ఎన్ని జీవితాలు నిశ్శబ్దంగా సులభమయ్యాయో దానితో కొలుస్తారు అని తెలిపారు. మీరు వేర్వేరు రాష్ట్రాల నుంచి, వేర్వేరు ప్రాంతాల నుంచి, వేర్వేరు నేపథ్యాల నుంచి వచ్చారు. కొంతమంది తెలంగాణకు చెందినవారు, మరికొందరు దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు. మీరు వేర్వేరు సేవలను, వేర్వేరు విభాగాలను ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు.

కానీ, మీ అందరినీ కలిపే ఒక ప్రశ్న ఉంది. మీ స్నేహితులు, కుటుంబ సభ్యులు తప్పకుండా అడిగి ఉంటారు అని ఆసక్తిగా డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ఈ వయసులో, ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు ఉన్నప్పుడు కూడా, మీరు ఎందుకు ప్రభుత్వ సేవను ఎంచుకున్నారు? మీరు కార్పొరేట్ రంగంలోకి వెళ్లి సంపాదించవచ్చు కదా? పేరు ప్రఖ్యాతులు సంపాదించవచ్చు కదా? సొంత వ్యాపారాలు నిర్వహించుకోవచ్చు కదా? కానీ, మీరు రాష్ట్ర వ్యవస్థలో పనిచేయాలని, ప్రజా కార్యక్రమాలను అమలు చేయాలని, మీ పేరు కూడా తెలియని పౌరులకు సేవ చేయాలని ఎంచుకున్నారు. ఆ ఎంపికకు విలువ ఉంది, అదే మీ వ్యక్తిత్వాన్ని నిర్వచిస్తుందని పేర్కొన్నారు.

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాని అయినప్పుడు, మహాత్మా గాంధీని సలహా అడిగారు. అప్పుడు గాంధీజీ స్పందిస్తూ ఎప్పుడైనా సందేహం వచ్చినప్పుడు, మీరు చూసిన అత్యంత పేద, బలహీనమైన వ్యక్తిని గుర్తు చేసుకోండి. మీ నిర్ణయం ఆ వ్యక్తికి ఉపయోగపడుతుందా? అని మీరే మిమ్ములను ప్రశ్నించుకోండి. ఉపయోగపడితే అదే సరైన నిర్ణయంగా భావించండి గాంధీజీ నెహ్రూ కు సలహా ఇచ్చారని వివరించారు. ఆ సరళమైన పరీక్ష అనేక తరాలుగా ప్రజాసేవకులను మార్గనిర్దేశం చేసింది. అది ఈ రోజుకీ అంతే ప్రాధాన్యతతో ఉంది అని డిప్యూటీ సీఎం వివరించారు.

ప్రజాజీవితంలో మెల్లగా దారి తప్పడం చాలా సులభం. దూరంగా మారడం, బాధ్యత కంటే అధికారాన్ని ఎక్కువగా ఆస్వాదించడం అందులో భాగమే. మొదటిసారి సేవలో చేరినప్పుడు ఉన్న లక్ష్యాన్ని, అనుకోకుండా అయినా, మరిచిపోతుంటారన్నారు. దీని నుంచి మిమ్ములను మీరే కాపాడుకోండి. సాధారణ ప్రజలతో ఎప్పుడూ సంబంధం కొనసాగించండి. గౌరవంతో కలవండి. ఓర్పుతో వినండి. పౌరులతో గడిపే సమయం పని నుంచి దూరం చేసే విషయం కాదు అన్నారు.అదే మీ పని అసలైన ఉద్దేశ్యం కూడా అని డిప్యూటీ సీఎం వివరించారు.

ఎయిర్ కండిషన్డ్ కార్యాలయంలో కూర్చుని ఫైళ్లను క్లియర్ చేయడం అవసరమే. కానీ, అది మానవ సంబంధాలకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోండన్నారు. ఈ ప్రాంగణాన్ని మీరు జ్ఞానం, ఆత్మవిశ్వాసం, ఆశతో విడిచిపెడుతున్నారు. ఇకమీకు అవసరమయ్యేది వివేచన, వినయం, నైతిక ధైర్యం అని డిప్యూటీ సీఎం వివరించారు. మన సంస్థల భవిష్యత్తు ప్రసంగాల వల్ల లేదా విధానాల వల్ల మాత్రమే కాదు.

మీరు ప్రతిరోజూ తీసుకునే నిర్ణయాల వల్ల, చాలాసార్లు నిశ్శబ్దంగా, గుర్తింపు లేకుండా, ఎవరూ చూడని సమయంలో తీసుకునే నిర్ణయాల వల్ల రూపుదిద్దుకుంటుంది అన్నారు. నిజాయితీతో సేవ చేయండి. ధైర్యంతో నిర్ణయాలు తీసుకోండి. సానుభూతితో నాయకత్వం వహించండి అని శిక్షణ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.





## సురవరం సుధాకర్ రెడ్డి ఆశయ సాధన కోసం

# కమ్యూనిస్టులు పోరాడాలి : పల్లా వెంకటరెడ్డి

మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య): సీపీఐ అగ్ర నాయకుడు, అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మహా విప్లవ నేత అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త నిరంతరం పోరాడాలని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు..సీపీఐ శత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన సురవరం సుధాకర్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులు, పార్టీ నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలు మానసిక ఉత్తేజాన్ని, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడలను ప్రభుత్వాలు మరింతగా ప్రోత్సహించాలని, ప్రతి మండల కేంద్రంలో కనీసం ఒక స్టేడియం నిర్మిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ-యువకులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం లభిస్తుందని అన్నారు. ప్రపంచ దేశాలు అద్భుతమైన స్టేడియాలు నిర్మించి క్రీడలను ప్రోత్సహిస్తున్నప్పటికీ, మన ప్రభుత్వాలు మాత్రం క్రీడాకారుల పట్ల నిర్లక్ష్యం వహించడం బాధాకరమని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెలికంటి సత్యం మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా సీపీఐ నాయకత్వం క్రికెట్ పోటీలను నిర్వహించి యువతను క్రీడల వైపు ఆకర్షించినందుకు జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో పర్వతాలు సూపర్ కింగ్స్ జట్టు, ఆల్వాతి రాయల్ కార్ సీసీ జట్టుతో తలపడి విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. విజేత జట్టుకు మొదటి ట్రోఫీని ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కే. రామస్వామి, టీ. రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. ప్రభులింగం, భారతరాజు, నరసింహ, ఆర్. యాదగిరి, ఎం.ఏ. రియాజ్, కే. నరసింహారెడ్డి, శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి, శేర్లింగంపల్లి మండల కార్యదర్శి కె. చందు యాదవ్, మహిళా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, క్రికెట్ నిర్వాహకులు ప్రవీణ్ కుమార్ గౌడ్, రాజేందర్ గౌడ్, ఎండి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన

# ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

నల్లగొండ,డిసెంబర్ 18 (వార్త వేదిక సూర్య): నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.గురువారం ఆమె పెద్ద ఊర మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి ధాన్యం కొనుగోలును పరిశీలించారు. 17 శాతం తేమతో ,తాలు, తరుగు లేకుండా, నాణ్యత ప్రమాణలతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, జాప్యం చేయొద్దని, ధాన్యాన్ని తూర్పారబట్టాలని, మంచు కురుస్తున్నందున ధాన్యం మీద పట్టాలు కప్పి ఉంచాలని, ఎప్పటికప్పుడు తేమ శాతం పరిశీలిస్తూ



రైతులకు మేలు కలిగేలా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వహకులతో అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 107 ధాన్యం లారీలు కొనుగోలు చేశామని , 23,400 కింటాలు సన్న ధాన్యం కొన్నామని చెప్పారు.

మంచు ఉన్నందున తేమ వచ్చేవరకు ఆరబోసి తేమ వచ్చిన తర్వాత పూర్తి చేస్తామన్నారు. రైతులతో మాట్లాడుతూ ఏమైనా ఇబ్బందులు ఉన్నాయని అడిగారు. ధాన్యం కొనుగోలు విషయంలో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, పిఎసిఎస్ ఛైర్మన్ వెంకటరెడ్డి ,తహసిల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో ఉషాదేవి, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.





# ప్రతిపక్షాలవి మసిపూసి మారేడుకాయ చేసే రాజకీయాలు

**గ్రామ స్వరాజ్యానికి కాంగ్రెస్ పునాది : మంత్రి పొంగులేటి**

**కొత్తగూడెంలో ఐదు నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల అభినందన సభ**

హైదరాబాద్, (వార్తా వేదిక సూర్య): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించిందని, ఇది ఇందిరమ్మ పాలనపై ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.

కొత్తగూడెం నియోజకవర్గం చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు చెందిన నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గెలుపొందిన 400 మందికి పైగా సర్పంచులను, వేలాది మంది వార్డు సభ్యులను మంత్రి శాలువాలతో సత్కరించి అభినందించారు.

**కార్యకర్తలే పార్టీకి ఆయువుపట్టు**

సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... రాజకీయాల్లో ఏ పార్టీ జెండా ఎగరాలన్నా, ఏ నాయకుడి భవిష్యత్తు మారాలన్నా దానికి గ్రామ స్థాయి కార్యకర్తలే పునాది అని కొనియాడారు. గత పదేళ్లలో మునుపటి ప్రభుత్వం అప్రజాస్వామికంగా, కుట్రలతో వ్యవహరించిందని, కానీ తమ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు నిర్వహించి గ్రామ స్థాయి నాయకత్వాన్ని బలపరిచిందని పేర్కొన్నారు. “భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 70 శాతానికి పైగా స్థానాల్లో మూడు రంగుల జెండాను రెపరెపలాడించిన ఘనత మీదే” అని ఆయన ప్రజాప్రతినిధులను ఉద్దేశించి అన్నారు.

**ప్రతిపక్షాలవి మసిపూసి మారేడుకాయ చేసే రాజకీయాలు**

పంచాయతీ ఫలితాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను మంత్రి తీవ్రంగా ఖండించారు. ఓటమిని జీర్ణించుకోలేక గులాబీ పార్టీ పత్రికల్లో అంకెల గారడీ చేస్తూ ప్రజలను మసిపూసి మారేడుకాయ చేయాలని చూస్తోందని ఎద్దేవా చేశారు. నిజాయితీగా గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని, రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ ఇదే ఫలితం పునరావృతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితమే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు.

**కార్యకర్తలకు భరోసా.. ‘నేనున్నానంటూ’ హామీ**

కొత్తగూడెం నియోజకవర్గంలో మిత్రపక్షం ఎమ్మెల్యే ఉన్నప్పటికీ, కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని పొంగులేటి స్పష్టం చేశారు. “మీ శీనన్నగా నేను ఉన్నాను.. ఏ ఒక్క కార్యకర్తకు చిన్న నొప్పి తగిలినా అండగా ఉంటా” అని భరోసానిచ్చారు. తృటిలో ఓడిపోయిన అభ్యర్థులను కూడా ఆదుకుంటామని, క్రిస్మస్ పండుగ లోపే ప్రతి నియోజకవర్గంలో విస్తృత స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి గెలిచిన వారిని గౌరవించుకుంటామని ప్రకటించారు.

**హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని మంత్రి పునరుద్ఘాటించారు. గడిచిన రెండేళ్లలో చేసిన సంక్షేమ కార్యక్రమాలే ఈ విజయానికి సోపానాలని ఆయన అన్నారు.

# ఈ విజయం రేవంత్ అహంకారానికి గుణపాఠం

- గులాబీ జెండాను గుండెలకు హత్తుకున్న ప్రజలు.
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పంచాయితీలు నిర్వీర్యం
- పతనం అంచులో ప్రభుత్వం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



హైదరాబాద్,(వార్తా వేదిక సూర్య): సకాలములో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేక పోవడం ప్రభుత్వ అసమర్థత అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు ఆలస్యం చేయడం వల్ల గ్రామ పంచాయతీలు నిర్వీర్యం అయినాయని ప్రభుత్వ పనితీరు బాగుంటే ప్రజలు బ్రహ్మరథం పడతారని కానీ ప్రజలు ప్రభుత్వం పట్ల తీవ్ర అసహనం,అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఓటు ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని నిరంజన్ రెడ్డి విమర్శించారు.

పార్టీపరంగా జరిగిన ఎన్నికలు కాకున్నా గులాబీ జెండా,కె.సి.ఆర్ బొమ్మ,స్థానిక నాయకులు కనిపిస్తే చాలు ప్రజలు గుండెలకు హత్తుకున్నారని దీన్ని బట్టి ప్రభుత్వంపై ప్రజలలో ఉన్న అసంతృప్తి ప్రస్ఫుటం అయిందని స్పష్టం చేశారు.బి.ఆర్.ఎస్ అభ్యర్థులకు ప్రజలు ఇచ్చిన మద్దతు చూస్తుంటే ఈ ప్రభుత్వం పతనం అంచులో ఉందని అర్థమౌతుందని అందుకే బి.ఆర్.ఎస్ విజయ దుందుభి మోగించింది అని అన్నారు.

అధికార పార్టీ ఎన్ని అరాచకాలకు, దౌర్జన్యాలకు, ప్రలోభాలకు, మాయమాటలకు పాల్పడిన ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, బి.ఆర్.ఎస్ ఎక్కడుంది పార్టీని బొంద పెట్టినం అన్నవాళ్ళకు ఈ విజయం చెంపపెట్టులాంటుందని ఘాటుగా విమర్శించారు. ఈ విజయం రేవంత్ అహంకారానికి గుణ పాఠం అని ఇంతటి విజయాన్ని ఇచ్చిన ప్రజలకు కృషి చేసిన నాయకు లకు కార్యకర్తలకు శుభాకాంక్షలు,ధన్యవాదాలు అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గారు అన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

### కొత్త చట్టాల పేరుతో కౌలు రైతులు, యజమానుల మధ్య
# పంచాయతీలు పెడుతున్నారు

- గణపురం ఆనకట్టకు సాగునీటి విడుదలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలి
- యాసంగి సాగుపై మెదక్ జిల్లా రైతాంగం తీవ్ర అయోమయంలో ఉంది
- వేసవిలో చేయాల్సిన సింగూరు మరమ్మతులు ఇప్పుడు చేయడం ప్రభుత్వ అసమర్థత కు నిదర్శనం
- కేసీఆర్ పాలనలో బోరు బండి మాయమైతే, రేవంత్ పాలనలో మళ్లీ బోర్లు వచ్చాయి
- సింగూరు ప్రాజెక్టు నీటిపై మెదక్, నిజామాబాద్ రైతుల హక్కును కాపాడాలి
- సాగునీరు ఇవ్వకపోతే క్రాఫ్ హాలిడే ప్రకటించి ఎకరాకు నష్టపరిహారం చెల్లించాలి
- గత యాసంగి, ఈ వానాకాలం బకాయి 1800 కోట్ల బోనస్ విడుదల చేయాలి
- స్మార్ట్‌ఫోన్లు లేని మహిళా రైతులు అధికారుల చుట్టూ తిరగాలా?
- వ్యవసాయానికి యాప్‌లు, మ్యాప్‌లు కాదు.. నీళ్లు, కరెంటు, ఎరువులు కావాలి
- మాజీ మంత్రి హరీష్ రావు

మెదక్,(వార్త వేదిక సూర్య): కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల మెదక్ జిల్లా రైతాంగం నేడు అగమ్యగోచర స్థితిలో ఉంది. యాసంగి పంట సాగు చేయాలా వద్దా అన్న సందిగ్ధంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. సింగూరు ప్రాజెక్టు నుండి గణపురం ఆనకట్టకు సాగునీరు విడుదల చేస్తారా లేదా అన్న అంశంపై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడం దారుణం. పాపన్నపేట, హవేలీఘన్పూర్, కొల్చారం, మెదక్ రూరల్ మండలాల్లోని వేలాది ఎకరాలు గణపురం కట్టపైనే ఆధారపడి వ్యవసాయం సాగు చేస్తారు.

సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల పేరుతో ప్రభుత్వం నీటిని ఖాళీ చేసింది. నిజానికి ఈ పనులు వేసవి కాలంలోనే పూర్తి చేసి ఉంటే ఇప్పుడు యాసంగికి ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం ప్రాజెక్టులో 17 టీఎంసీల నీరు ఉంది, పంటను కాపాడుతూనే మరమ్మతులు చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వానికి ఆ చిత్తశుద్ధి లేదు. నాట్లు వేసే సమయం ఆసన్నమైనా అధికారులు, పాలకులు స్పందించకపోవడంతో రైతులు గత్యంతరం లేక మళ్ళీ బోర్లు వేస్తూ అప్పుల పాలవుతున్నారు.

కేసీఆర్ పదేళ్ల పాలనలో బోరు బండి మాయమైతే, రేవంత్ రెడ్డి పాలన వచ్చిందంటే మళ్ళీ పాత రోజులు వచ్చాయి. సింగూరు నీటిపై మెదక్, నిజామాబాద్ రైతుల హక్కును కాపాడాలి. తక్షణమే నీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయాలి, లేని పక్షంలో క్రాఫ్ హాలిడే ప్రకటించి ఎకరాకు తగిన నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి. గత పది సంవత్సరాల్లో రెండు పంటలకు నీళ్లు ఇచ్చి హైదరాబాద్ కు రైతులు రాకుండా చూసింది బిఆర్ఎస్ ప్రభుత్వం.

అవసరమైతే కాళేశ్వరం నీళ్లను మళ్లించి పంటలను కాపాడాం.

కానీ ఈ ప్రభుత్వం రైతులను అయోమయానికి గురి చేస్తూ మొద్దు నిద్ర పోతోంది. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ, రైతుబంధు, బోనస్ విషయంలో రైతులను దారుణంగా మోసం చేసింది. ఏడుపాయల సాక్షిగా ప్రమాణం చేసి రుణమాఫీ చేస్తానన్న ముఖ్యమంత్రి, నేటికీ కేవలం 40 శాతం మందికి మాత్రమే పూర్తి చేశారు. గత యాసంగి ఈ వానాకాలం కలిపి



రైతులకు రావాల్సిన సుమారు 1800 కోట్ల రూపాయల బోనస్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి.

యాసంగి సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి సాయం ఊసే లేదు. సాగు చేసిన వారికే ఇస్తామంటూ సాకులు వెతుకుతూ పత్తి, చెరుకు, పసుపు సాగు చేసే రైతులకు ఎగనామం పెట్టాలని చూస్తున్నారు. ఎటువంటి కోతలు లేకుండా రైతుబంధు నిధులను తక్షణమే విడుదల చేయాలి. పోయిన వానాకాలంలో యూరియా, జనుము, జీలుగు విత్తనాలు దొరక్క రైతులు అష్టకష్టాలు పడ్డారు. వ్యవసాయానికి నీళ్లు, కరెంటు, ఎరువులు ఇవ్వడం చేతగాక ఈ ప్రభుత్వం యాప్‌లు, మ్యాప్‌ల పేరుతో దొంగ నాటకాలు ఆడుతోంది.

అక్షరాస్యత లేని రైతులు, స్మార్ట్‌ఫోన్లు లేని మహిళా రైతులు అధికారుల చుట్టూ తిరగాలా? నెట్‌వర్క్ లేని గ్రామాల్లో రైతులు ఈ యాప్‌లు ఎలా వాడతారు? ఇది కేవలం ఎరువుల సరఫరాను తగ్గించి రైతులను వేధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆడుతున్న నాటకం. పత్తి రైతులకు కపాస్ యాప్ తెచ్చి బీజేపీ ముంచితే, ఎరువుల కోసం యాప్ తెచ్చి కాంగ్రెస్ ముంచుతోంది. కౌలు రైతుల భవిష్యత్తును కూడా ఈ ప్రభుత్వం ప్రశ్నార్థకం చేసింది. తక్షణమే ఈ యాప్ నాటకాలు బంద్ చేసి, గతంలో మాదిరిగా ఫెర్టిలైజర్ షాపుల ద్వారా యూరియా అందించాలి.

కేసీఆర్ హయాంలో యూరియా, కరెంటు, రైతుబంధు, పంట కొనుగోలుకు ఎన్నడూ ఇబ్బంది లేదు. ఇప్పుడు అన్నీ ఇబ్బందులే, ఎక్కడా 14 గంటల కరెంటు కూడా రావడం లేదు. రైతులకు, కౌలు రైతులకు మధ్య పంచాయతీలు పెడుతూ అడుగడుగునా రైతులను కష్టాల పాలు చేస్తున్నారు. పంట కొనుగోలు విషయంలోనూ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.

తక్షణమే రుణమాఫీ పూర్తి చేయాలి, బోనస్ బకాయిలు చెల్లించాలి, రైతుబంధు విడుదల చేయాలి మరియు గణపురం ఆనకట్ట నీటిపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.

---


## ఫిరాయించిన ఎమ్మెల్యేలను సమర్థించడం రేవంత్ దివాళా కోరుతనం

- బిజెపి బిఆర్ఎస్ పార్టీలు కలిసి పోటీ చేసి ఎనిమిది స్థానాలు గెలుచుకుందని మాట్లాడటం ప్రజలను అవమానపరిచినట్లే
- ఎన్ రాంచందర్ రావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు నేడు తేదీ 18 డిసెంబర్ 2025న హైదరాబాద్

హైదరాబాద్,(వార్త వేదిక సూర్య): భారతీయ జనతా పార్టీ బిఆర్ఎస్ పార్టీ కలిసి పోటీ చేశాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండి స్తున్నాం. భారతీయ జనతా పార్టీ స్వతహాగా కార్యకర్తల కష్టంతో ప్రజల అండతో రాష్ట్రంలో అధికార పార్టీకి ప్రత్యామ్నాయంగా పెద్ద ఎత్తున సర్పంచులను, వార్డు సభ్యులను గెలుచు కోవడం జరిగింది. రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ పార్టీ రెండు ఒకటి కాకపోతే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వెంటనే చర్యలు తీసుకోవాలి. నేను కొట్టినట్టు చేస్తా. నీవు ఏడ్చినట్టు చెయ్యి అన్నట్టు బిఆర్ఎస్ పార్టీ ఫిరాయింపులపై ఫిర్యాదు చేయడం కాంగ్రెస్ పార్టీ స్పీకర్ పై ఒత్తిడి తీసుకొచ్చి దాన్ని తిరస్కరించడం ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారు.

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు లోక్ సభ ఎన్నికలలో ఎవరి తరపున ప్రచారం చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి సమర్థించడం ముఖ్యమంత్రి దివాళా కోరుతనానికి నిదర్శనం. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై మరోసారి అసెంబ్లీలో చర్చిస్తాం అనడానికి రిజర్వేషన్లను



దాటవేయడానికి చేస్తున్న కుట్రలో భాగమే.

రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కుట్రలు కుతంత్రాలతో బిఆర్ఎస్ కాంగ్రెస్ ఒక్కటైనప్పటికీ బిజెపి పై అబండాలు వేస్తూ ప్రజలను మోసం చేయాలనే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో తెలంగాణ ప్రజలు అబద్ధాలు సైతం నమ్ముతారని నమ్మకంతో అబద్దాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు.

గత పార్లమెంట్ ఎన్నికల్లో 14 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుచుకోకపోతే కాంగ్రెస్ పార్టీ పరిపాలనకు రెఫరండమని మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ఎన్నికలలో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి 8 స్థానాలు ఇచ్చి భారతీయ జనతా పార్టీకి 8 స్థానాలు రావడంతో, నేడు పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి బిఆర్ఎస్ పార్టీలు కలిసి పోటీ చేసి ఎనిమిది స్థానాలు గెలుచుకుందని మాట్లాడం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలను అవమానపరిచినట్లే.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్న సీట్లు సున్నా అనే విషయం మర్చిపోయి మాట్లాడడం వారి జ్ఞాపకశక్తిని గుర్తు చేస్తుంది. భారతీయ జనతా పార్టీ రెండు స్థానాలను గెలుచుకుంది. అందులో కాంగ్రెస్ పార్టీ చెందిన స్థానాన్ని కూడా భారతీయ జనతా పార్టీ గెలుచుకుంది.

---

### గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి
# గాంధీ పేరు తొలగించడం బాధాకరం

- ఎంపీ వద్దిరాజు



హైదరాబాద్: దేశంలోని వ్యవసాయ కూలీలు,పేద బడుగు,బలహీన వర్గాల సంక్షేమం కోసం రెండు దశాబ్దాల కిందట తీసుకువచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నరేగా)లో నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించడం బాధాకరమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు.

గాంధీజీని దేశమంతా జాతిపిత అని గౌరవంగా పిలుచుకుంటారని, ఆయన గ్రామ స్వరాజ్యం గురించి కలలుగన్నా రన్నారు. నరేగా పథకంలో నుంచి గాంధీజీ పేరు తొలగించడం పట్ల దేశ ప్రజలందరూ బాధాపడుతున్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.రాజ్యసభలో గురువారం సాయంత్రం ఈ పథకంపై జరిగిన చర్చలో ఎంపీ రవిచంద్ర పాల్గొని మాట్లాడుతూ,శ్రీరాముడు అంటే అందరికి ఇష్టమేనని, ప్రాణప్రదమే అని, దైవంగా ఆరాధిస్తామని, దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించి పెట్టిన మహాత్మాగాంధీని కూడా గొప్పగా కొనియాడు తామన్నారు. అటువంటి మహనీయుడి పేరును తొలగించకుండా అదేవిధంగా కొనసాగించాలని ఎంపీ వద్దిరాజు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.నరేగా పథకాన్ని అదే మాదిరిగా కొనసాగిస్తూ, దేశంలోని పేద,బడుగు, బలహీన, అణగారిన వర్గాల సంక్షేమం,సముద్ధరణకు మరొక కొత్త పథకం తీసుకువస్తే అన్ని వర్గాల ప్రజలు హర్షిస్తారని ఎంపీ రవిచంద్ర సలహానిచ్చారు.ఈ పథకంలో పని దినాలను 100 నుంచి 125 కు పెంచడం సంతోషకరమన్నారు.అయితే,90:10 నిష్పత్తిలో ఉన్న వాటాను 60:40గా ఇందులో పేర్కొనడం సమంజసం కాదని, సబబుగా లేదని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు. ఇది రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారం పెంచేదిగా ఉన్నదని, కొత్తగా ఏర్పడిన మా తెలంగాణకు మరింత ఇబ్బందికరంగా ఉంటుందని ఆయన వివరించారు.ఇది గ్రామాలు స్వయం సమృద్ధి సాధించే విధంగా, సమగ్రాభివృద్ధికి దోహదం చేసేదిగా,ప్రభుత్వాల ఆస్తులు పెంచేవిధంగా ఉండాలనేది తమ బీఆర్ఎస్ విధానమని ఎంపీ వద్దిరాజు చెప్పారు.అదేవిధంగా వ్యవసాయాన్ని దీనితో అనుసంధానం చేస్తే, పోచంపల్లి, సిరిసిల్ల తదితర చేనేత పరిశ్రమలను ఇందులో పొందుపరిస్తే రైతులు, వ్యవసాయ కూలీలు,నేతన్నలకు మరింతగా లాభం చేకూరుతుందని ఎంపీ వద్దిరాజు వివరించారు. ఇంటర్ నెట్ లేని చోట దీని డిజిటల్ పని విధానానికి ఆటంకం తలెత్తకుండా చూడాలని, పథకం పర్యవేక్షణకు రాష్ట్ర కౌన్సిళ్లతో పాటు జిల్లా కౌన్సిల్స్ కూడా ఏర్పాటు చేయాల్సిందిగా ఎంపీ రవిచంద్ర కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం బడ్జెట్ 2014-15లో 2,038 కోట్లు కాగా, ఇప్పుడు 4,344 కోట్ల రూపాయలుగా పేర్కొనడం సంతోషకర మన్నారు.ఈ పథకం బాగానే ఉందని,అయితే 90:10 నిష్పత్తి స్థానంలో 60:40 నిష్పత్తిలో కేంద్ర-రాష్ట్రాల వాటాను పేర్కొనడం చాలా ఇబ్బందికరంగా ఉందని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు.ఈ కారణంగా రాష్ట్రాలపై అదనపు భారం పడుతుందని,మరిన్ని ఆర్థిక ఇబ్బందులు వస్తారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఆర్థిక భారం వల్ల ఈ పథకానికి సంబంధించిన నిధులను రాష్ట్రాలు ఇతర కార్యక్రమాలకు బదలాయించే అవకాశం ఉందని ఎంపీ వద్దిరాజు అభిప్రాయపడ్డారు. వీబీ-జీ రామ్ జీ పథకాన్ని వెంటనే అమలు చేయాల్సిన అత్యవసరం ఏమి లేదని,ఆరు నెలలు ఆలస్యమైనా కూడా నష్టం లేదన్నారు. ఈ సున్నితమైన, ముఖ్యమైన బిల్లును జాతీయ అభివృద్ధి మండలి (ఎన్డీసీ)లో పెట్టి అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని ఎంపీ రవిచంద్ర సలహానిచ్చారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీకి లేదా సెలెక్ట్ కమిటీకి పంపితే బాగుం టుందని ఎంపీ రవిచంద్ర సూచించారు.ఈ పథకాన్ని వెంటనే అమలు లోకి తేకుండా పునరాలోచన చేయాల్సిందిగా ఎంపీ వద్దిరాజు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

---

### ఎల్‌బీ స్టేడియంలో ఘనంగా క్రిస్మస్ డిన్నర్
# నిర్వహించనున్న తెలంగాణ ప్రభుత్వం

- కార్యక్రమానికి హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్

హైదరాబాద్,(వార్త వేదిక సూర్య): ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న క్రిస్మస్ డిన్నర్ కార్యక్రమానికి సంబంధించి అత్యుత్తమ, వృత్తిపరమైన మరియు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ఈ రోజు ఉన్నతాధికారులు మరియు వివిధ శాఖల అధిపతులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పూర్తి స్థాయి మరియు లోటుపాట్లు లేని ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న ఈ డిన్నర్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరై క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేయనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం డిసెంబర్ 25న జరుపుకునే పవిత్ర క్రిస్మస్ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడుతోందన్నారు.

ఈ డిన్నర్ కార్యక్రమానికి సుమారు 10,000 మంది క్రైస్తవులు హాజరుకానున్నట్లు మంత్రి తెలిపారు. ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు డిసెంబర్ 18న ఎల్‌బీ స్టేడియాన్ని అధికారులు తనిఖీ చేయనున్నారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర, లౌకిక దృక్పథాన్ని వివరించిన మంత్రి, ముఖ్యమంత్రి అన్ని మతాలకు సమాన గౌరవం ఇస్తారని, ఆ ఆలోచనకు ప్రతిబింబంగా ఈ క్రిస్మస్ డిన్నర్ కార్యక్రమం శాంతియుతంగా, ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. "క్రైస్తవ సమాజానికి ఇది ఎంతో పవిత్రమైన మరియు ఆనందదాయకమైన రోజు. ప్రజలకు చిన్న అసౌకర్యం కూడా కలగకూడదు. అన్ని ఏర్పాట్లు పూర్తిగా వృత్తిపరమైన రీతిలో జరగాలి," అని మంత్రి స్పష్టం చేశారు.

తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, పారిశు



ధ్యం, లైటింగ్ మరియు అలంకరణ, కూర్చునే ఏర్పాట్లు, ట్రాఫిక్ మరియు జనసమూహ నియంత్రణ, భద్రత, అగ్నిమాపక భద్రత, ఆహార నాణ్యత, అత్యవసర వైద్య సేవలు వంటి అన్ని అంశాలపై సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.

---

### గ్రామీణ ప్రాంతాల్లో వస్తున్న
# ఈ విజయాలే గట్టి సమాధానం

- తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అవసరం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో భువనగిరి జిల్లాలో గెలిచిన బీజేపీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు సత్కార కార్యక్రమం లో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

భువనగిరి,(వార్త వేదిక సూర్య): భువనగిరి జిల్లాలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లుగా గెలుపొందిన బీజేపీ ప్రజాప్రతినిధు లను భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా రాంచందర్ రావు గారు మాట్లాడుతూ... ఈ విజయం బీజేపీ కార్యకర్తల కష్టానికి, వారి నాయకత్వానికి, గ్రామీణాభివృద్ధి పట్ల మోదీ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతపై ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి ప్రతిబింబమని ఆయన పేర్కొన్నారు.

గ్రామస్థాయి నుంచే బీజేపీ పార్టీ మరింత బలోపేతం అవుతోందని, 'వికసిత్ భారత్' లక్ష్యసాధనకు అనుగుణంగా.. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఇంటికి పార్టీని విస్తరించేలా.. ఈ విజయాలు బలమైన, స్థిరమైన పునాదిని ఏర్పాటు చేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు రాష్ట్రశాఖ తరఫున శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో అన్ని చోట్ల పోటీ చేయలేకపోయినా, పోటీ చేసిన చోట్ల బీజేపీకి మంచి ఫలితాలు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో స్థానిక నాయకుల బెదిరింపులు, ఒత్తిడులు ఎదురైనా, ప్రజలు ధైర్యంగా బీజేపీకి మద్దతుగా నిలిచారు.

రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు వెయ్యి మంది సర్పంచులు, 1200 మంది ఉపసర్పంచులు, 10,000 మందికి పైగా వార్డు మెంబర్లు బీజేపీ తరఫున గెలుపొందారు. గతంలో బీజేపీ నగరాలకే పరిమితమైన పార్టీ అని విమర్శించినవారికి, గ్రామీణ ప్రాంతాల్లో వస్తున్న ఈ విజయాలే గట్టి సమాధానం.

2019లో బీజేపీ 163 స్థానాల్లో గెలిచింది. ఇప్పుడు "పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు" పోటీ చేసి సుమారు వెయ్యి స్థానాల్లో సర్పం చులను గెలిపించుకుంది. ఈ విజయాలు బీజేపీ కార్యకర్తల అంకిత



భావానికి, వారి నాయకత్వానికి మరియు గ్రామీణాభివృద్ధి పట్ల మోదీ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతపై ప్రజలు పెట్టుకున్న విశ్వాసానికి నిదర్శనం. గ్రామస్థాయి నుంచే బీజేపీ సంస్థ మరింత బలోపేతం అవుతోంది. 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని ప్రతి ఇంటి దాకా తీసుకెళ్లేందుకు ఈ గెలుపులు బలమైన పునాదిని వేస్తాయి. రాబోయే రోజుల్లో అధికారమే లక్ష్యంగా గ్రామాల్లో బిజెపి బలపడుతుంది. 2028లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందనే పూర్తి విశ్వాసం ఉంది. రాష్ట్రంలో గతంలో అధికార పార్టీ అధికార దుర్వినియోగం, డబ్బు, పోలీసు ఒత్తిళ్లతో నామినేషన్లు వేయనివ్వకుండా చేసింది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 8 వేల సర్పంచుల నుంచి 2 వేల వరకు సంఖ్య పడిపోవడం, ఆ పార్టీ గ్రాఫ్ మరింత దిగజారిందనడానికి నిదర్శనం. భువనగిరి మండలంతో పాటు జిల్లాలో ప్రధాన గ్రామపంచాయతీల్లో సర్పంచులు, అధిక సంఖ్యలో ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు బీజేపీ తరఫున గెలుపొందారు.

గ్రామీణాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యంతో పనిచేస్తున్నది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, ఆయుష్మాన్ భారత్, హర్ ఘర్ నల్, గ్రామీణ రోడ్ల అభివృద్ధి, ఇలా అనేక పథకాల ద్వారా పెద్దఎత్తున నిధులు విడుదల చేస్తోంది. ఉచిత బియ్యం, ధాన్యం కొనుగోలుతో పాటు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే అమలు చేస్తోంది. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అవసరం. రానున్న కాలంలో రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం.






www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



# అల్లు అర్జున్ సిస్టర్‌గా మృణాల్ ఠాకూర్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే భారీ చిత్రంపై బన్నీ ఫ్యాన్స్‌తో పాటు సినీ ఇండస్ట్రీలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే అధికారిక అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో క్రేజీ టాక్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు సిస్టర్ రోల్‌లో నటించబోతున్నారట. ఈ పాత్ర కథలో చాలా కీలకమైనదిగా, బలమైన ఎమోషనల్ టోన్‌తో సాగుతుందని టాక్. అన్న-చె÷-లలెల మధ్య బంధం, భావోద్వేగాలను అట్లీ తన మార్క్ స్టైల్‌లో చూపించబోతున్నాడని, ఈ పాత్ర ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తుందని అంటున్నారు. అయితే ఇది అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. నిజంగా మృణాల్ సిస్టర్ రోల్‌లో కనిపిస్తారా? లేక మరో షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో వస్తారా? అన్నది వేచి చూడాల్సిందే. ఇక ఈ సినిమాకు సంబంధించిన మరో హైలైట్ ఏమిటంటే.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణె ఇందులో మెయిన్ హీరోయిన్‌గా నటించనుండగా, జాన్వీ కపూర్ మరో కీలక హీరోయిన్ పాత్రలో కనిపించనుంది. ఒకే సినిమాలో ఇంతమంది స్టార్ హీరోయిన్లు ఉండటం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్రేజ్ పెరుగుతోంది. కథ విషయానికి వస్తే.. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో ఓ డాన్ చుట్టూ తిరిగే పవర్‌ఫుల్ కథను అట్లీ సిద్ధం చేశాడట. యాక్షన్, ఎమోషన్, డ్రామా అన్నీ సమపాళ్లలో ఉండేలా స్క్రిప్ట్‌ను రూపొందించినట్టు సమాచారం. అల్లు అర్జున్‌ను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా, ఒక కొత్త షేడ్స్ ఉన్న పాత్రలో చూపించేందుకు అట్లీ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు తెలుస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ వ్యాల్యూస్ విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా, హాలీవుడ్ రేంజ్‌లో సినిమాను తెరకెక్కించేందుకు ఎలాన్ చేస్తున్నారట. అంతేకాదు, ఈ సినిమాలో కొన్ని ప్రత్యేక గెస్ట్ రోల్స్ కూడా ఉండబోతున్నాయని టాక్. వాటి కోసం అట్లీ పలువురు స్టార్ నటులను సంప్రదించనున్నారని సమాచారం. ఆ గెస్ట్ రోల్స్‌లో ఎవరు కనిపిస్తారన్నది మరో ఆసక్తికర అంశంగా మారింది.



# రవితేజ మూవీకి చిరు వాయిస్ ఓవర్

మాస్ మహారాజా రవితేజ హీరోగా ఇటీవల చాలా చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అందులో ఏ చిత్రం కూడా పెద్దగా ప్రేక్షకులని అలరించలేకపోయింది. ఇప్పుడు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు కిశోర్ తిరుమల దర్శకత్వంలో చేస్తున్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఇప్పటికే ఈ సినిమా అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తుండగా, ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు బలమైన ఎమోషన్ కూడా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో రవితేజ పాత్రను ప్రత్యేకంగా పరిచయం చేస్తూ మెగాస్టార్ చిరంజీవి తన స్వరంతో వాయిస్ ఓవర్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. సినిమాలో కీలకమైన సందర్భాల్లో రవితేజ పాత్ర గురించి వచ్చే వాయిస్ ఓవర్‌ను చిరంజీవి చెప్పనున్నారని, ఇది కథకు మరింత వెయిట్ పెంచడమే కాకుండా
సినిమాపై బలమైన ముద్ర వేయబోతుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి వాయిస్ ఓవర్ ఉండటం వల్లే సినిమాపై అంచనాలు మరో స్థాయికి చేరుకున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్, శాటిలైట్ హక్కుల డీల్స్ కూడా భారీ ధరకు పూర్తయ్యాయి. ప్రముఖ జీ గ్రూప్ ఈ సినిమా హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. థియేట్రికల్ రిలీజ్ తర్వాత జీ5 ఓటీటీ ఎలాట్‌ఫామ్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్‌కు రానుండగా, శాటిలైట్ ప్రసారాన్ని జీ తెలుగు మరియు జీ సినిమా ఛానల్స్ నిర్వహించనున్నాయి. జీ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే భీమ్స్ మ్యూజిక్‌పై ఉన్న క్రేజ్‌కు తోడు రవితేజ ఎనర్జీ, కిశోర్ తిరుమల కథనం కలిసి ఈ సినిమాను హిట్ ట్రాక్‌లో నిలబెడతాయనే నమ్మకం వ్యక్తమవుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునే అంశాలతో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సిద్ధమవుతోందని, రిలీజ్ దగ్గరపడే కొద్దీ ఈ సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# రెండు ఓటీటీల్లోకి సంతాన ప్రాప్తిరస్తు

ప్రేమ, కెరీర్, రిలేషన్‌షిప్స్ మాత్రమే కాదు, ఈతరం చెప్పలేనంత సున్నితమైన సమస్యలతో కూడా సంఘర్షణ పడుతోంది. అందులో ఒకటి సంతాన లేమి. బయటికి మాట్లాడాలంటే సంకోచం, లోపల వేల సందేహాలు, వందల ఒత్తిడులు. అలాంటి సున్నితమైన విషయాన్ని కథగా మలచుకున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన ఈ సినిమాకు సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించాడు. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఇప్పుడి ఇదే చిత్రం తాజాగా రెండు ఓటీటీల్లో విడుదల కానుంది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో', 'జియో హాట్‌స్టార్'లో ఈ నెల 19 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. చైతన్య (విక్రాంత్) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఓ ఎగ్జామ్ సెంటర్ లో కల్యాణి (చాందిని చౌదరి) ను చూసి ప్రేమలో పడతాడు. ఇద్దరూ దగ్గరౌతారు. కల్యాణి తండ్రి ఈశ్వరరావు (మురళీధర్ గౌడ్) వీరి ప్రేమని వ్యతిరేకించడంతో ఇద్దరూ పారిపోయి పెళ్లి చేసుకుంటారు. త్వరగా బిడ్డని కనేస్తే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తాడు చైతు. కాకపోతే పిల్లల విషయంలో తన ప్రయత్నాలు ఫలించవు. దీంతో ఓ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఆశ్రయిస్తాడు.




# దురంధర్‌తో సత్తా చాటిన అక్షయ్ ఖన్నా

'ధురంధర్' వంటి సూపర్ హిట్ సినిమాతో సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా క్రేజ్ మరోసారి ఆకాశాన్ని తాకింది. రణవీర్ సింగ్ హీరోగా నటించిన ఈ సినిమాలో అక్షయ్ ఖన్నా రెహ్మాన్ డకైట్ అనే పవర్‌ఫుల్ నెగటివ్ పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విలన్ అయినప్పటికీ హీరోకంటే ఎక్కువ ప్రశంసలు దక్కడం ఆయన నటనకు నిదర్శనంగా మారింది. ప్రతి సీన్‌లో తనదైన స్టైల్, ఇంపాక్ట్‌తో మెరిసిన అక్షయ్ ఖన్నా 'ధురంధర్' సినిమాకు ప్రధాన బలంగా నిలిచారు. ఇదే ఏడాది ప్రారంభంలో విక్కీ కౌశల్ హీరోగా నటించిన 'చావా' సినిమాలో ఔరంగజేబు పాత్రలో అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు

అందుకున్న ఆయన, ఇప్పుడు 'ధురంధర్'తో మరోసారి తన సత్తా చాటారు. కథ, పాత్ర ఏదైనా సరే.. తెరపై కనిపిస్తే తనదైన ముద్ర వేయడం అక్షయ్ ఖన్నాకే చెల్లింది అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

ఇక సినిమాలతో పాటు అక్షయ్ ఖన్నా వ్యక్తిగత జీవితం కూడా తరచూ చర్చకు వస్తుంటుంది. ప్రస్తుతం ఆయన వయసు సుమారు 50 సంవత్సరాలు. అయినప్పటికీ ఇప్పటివరకు పెళ్లి చేసుకోలేదు. దీనిపై గతంలో ఓ మీడియా ఇంటర్వ్యూలో అక్షయ్ ఖన్నా చాలా స్పష్టంగా మాట్లాడారు. 'నాకు బాధ్యతలు వద్దు. నేను ఒంటరిగా ఉండటానికే ఇష్టపడతాను. ఎవరి గురించి ఆందోళన చెందకుండా నా జీవితాన్ని నేను ఆస్వాదించాలనుకుంటాను. నాకు ఇప్పుడు ఉన్న జీవితం చాలా బాగుంది. దాన్ని ఎందుకు మార్చుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. అక్షయ్ ఖన్నా ప్రముఖ బాలీవుడ్ నటుడు వినోద్ ఖన్నా కుమారుడు. 2025 నాటికి ఆయన మొత్తం ఆస్తులు సుమారు రూ.167 కోట్లుగా అంచనా వేయబడుతున్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో బంగ్లాలు, విలాసవంతమైన కార్లు ఆయన సొంతం. సినిమాలతో పాటు రియల్ ఎస్టేట్ పెట్టుబడుల ద్వారా కూడా భారీగా సంపాదిస్తున్నారు. నటుడిగా, వ్యక్తిగా తనదైన మార్గంలో ముందుకు సాగుతున్న అక్షయ్ ఖన్నా, పెళ్లి లేకుండానే సంతృప్తికరమైన జీవితాన్ని గడుపుతూ బాలీవుడ్‌లో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంటున్నారు. 'ధురంధర్' విజయంతో ఆయనకు మరిన్ని ఆసక్తికర పాత్రలు రావడం ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి.




# హద్దుమీరిన అభిమానం

## నిధి అగర్వాల్‌కు చేదు అనుభవం

కొన్నిసార్లు అభిమానం హద్దులు దాటితే అది అభిమానంగా కాకుండా వేధింపుగా మారుతుంది. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో కొంతమంది అభిమానుల ప్రవర్తనపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' హీరోయిన్ నిధి అగర్వాల్‌కు ఇలాంటి షాకింగ్ అనుభవమే ఎదురైంది. ఆమెను చుట్టుముట్టిన అభిమానులు తోసేసుకుంటూ హీరోయిన్‌పైకి ఎగబడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రభాస్ హీరోగా నటిస్తున్న హారర్ కామెడీ థ్రిల్లర్ 'రాజాసాబ్'లో ముగ్గురు హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. ఈ చిత్రంలోని 'సహన సహన' పాటను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని లూలూ మాల్‌లో సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు నిధి అగర్వాల్‌తో పాటు మరో హీరోయిన్ రిధి కుమార్ కూడా హాజరయ్యారు. సాంగ్ లాంచ్ కార్యక్రమానికి భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈవెంట్ జరుగుతున్నంతసేపూ స్టేజ్ ముందు గుమిగూడిన అభిమానులు తోసుకుంటూనే కనిపించారు. అయితే ఈవెంట్ ముగిసిన తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిధి అగర్వాల్ బయటకు వెళ్లే సమయంలో ఒక్కసారిగా అభిమానులు ఆమెపైకి ఎగబడారు. తోసుకుంటూ ముందుకు రావడం, చేతులు వేయడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. సెక్యూరిటీ సిబ్బంది తీవ్రంగా శ్రమించడంతో చివరికి నిధి అగర్వాల్ కారులోకి ఎక్కగలిగింది. కారులో కూర్చోగానే ఆమె 'ఓ మై గాడ్' అంటూ షాక్‌కు గురైన దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది.



Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305**, Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya2025@gmail.com**